



ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు



ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, జేసీ చిన్నరాముడు

జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తాం

- రేడియాలజిస్టు నియామకానికి చర్యలు తీసుకుంటాం
- ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ప్రధాన సమస్యగా ఉన్న రేడియాలజిస్టు నియామకానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ బ్లాకులో సోమవారం నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి సంఘం (హెచ్‌డీఎస్) తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్, అల్ట్రా సౌండ్, ఎక్స్‌రే రిపోర్టులు రోగులకు త్వరగా అందేలా చూస్తామని పేర్కొన్నారు. గతంలో ఐఎంఏ ద్వారా అందించిన యూరాలజిస్టు, కార్డియాలజిస్టు తదితర సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను తిరిగి ప్రారంభిస్తామన్నారు.ఈ మేరకు మంగళవారం ఐఎంఏ ప్రతినిధులతో చర్చిస్తామన్నారు. అవసరమైతే గౌరవవేతనంతో రేడియాలజిస్టును తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎంసీహెచ్ బ్లాకులో రెండు అదనపు ఫ్లోర్లు అందుబాటులోకి వచ్చినా అవసరమైన వైద్య పరికరాలు రాలేదని, అవి త్వరగా ఏర్పాటు చేసేలా సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్నామన్నారు. ఆసుపత్రిలో బయో వ్యర్థాలను కాలుస్తున్నారని వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామన్నారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆసుపత్రి విషయంలో జరిగిన నిర్లక్ష్యాన్ని సరిచేస్తున్నామన్నారు.తమకు పెరిగిన వేతనాలు ఇవ్వడంలేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి ట్రామాకేర్ ఉద్యోగులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఆర్ఎంవో ప్రణవ్, హెచ్‌డీఎస్ సభ్యులు, ఆసుపత్రిలోని అన్ని విభాగాల హెచ్‌వోడీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అజెండాలో 24 అంశాలపై చర్చ..

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ అజెండాలోని 24 అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో చర్చకు ఉంచారు. హెచ్‌డీఎస్ సభ్యులు ఆసుపత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, సమస్యలపై సూచనలు, సలహాలు అందించారు. ఎన్టీఆర్ వైద్యసేవ నిధుల నుంచి చెల్లించేలా గౌరవ వేతనం ప్రాతిపదికన సిటీ టెక్నీషియన్ సేవలను వినియోగించుకునేందుకు అనుమతించాలని, సీఎస్ఆర్ నిధులతో రెండు అంబులెన్స్‌లు, న్యూరో సర్జికల్ పరికరాలు సమకూర్చాలని కోరారు. కొన్నేళ్లుగా ఎంఆర్ఐకు చెందిన విద్యుత్ ఛార్జీల బిల్లుల భారం పడుతున్న విషయాన్ని సమావేశం దృష్టికి తెచ్చారు. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ల సేవలను వినియోగించుకుని వారికి హెచ్‌డీఎస్ నిధులను వెచ్చించాలని రాజమహేంద్రవరం కమిషనర్ చేసిన రిక్వెస్ట్‌పైనా చర్చించారు. ఆసుపత్రి లాండ్రీ విభాగానికి చెందిన వాషింగ్‌మెషీన్ పనిచేయకపోవడంపై చర్చించారు. పాత ఏసీల మెయింటెనెన్స్ కాంట్రాక్టు, వన్ స్టాప్ సెంటర్‌కు 300 చదరపు మీటర్ల స్థలం, పాత ఫ్రీజర్లకు మరమ్మతులు, ఎన్టీఆర్ వైద్యసేవ నిధులు లేదా హెచ్‌డీఎస్ నిధుల నుంచి ఆఫీసుకు అవసరమైన కంప్యూటర్లు, ఫర్నిచర్, ప్రింటర్లు కొనుగోలు, గోదావరి పుష్కరాలకు తీసుకోవాల్సిన వైద్యపరమైన చర్యలు వంటి అంశాలను చర్చించారు. వీటిలో కొన్నింటిని ఆమోదించగా, పరికరాలు కొనుగోళ్లు, ఇతర భారీ బడ్జెట్ అంశాలను జిల్లా ఉన్నతాధికారుల అనుమతితో నిర్ణయం తీసుకుందామని వాయిదావేశారు. ఇటీవల ఆసుపత్రిలో ఒక పసికందు మృతిచెందిన ఘటనపై విచారణ చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ స్పెషలాఫీసర్‌కు సూచించారు.కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్నరాముడు,స్పెషలాఫీసర్ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.



పోలవరం ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

పోలవరం పరుగు

- 2026కి పూర్తి కావాలని ఆదేశం
- షెడ్యూల్ ప్రకటించిన బాబు
- మూడు రోజులు రాక్ పరిశీలన
- సీఎంకు కట్టుదిట్టమైన భద్రత
- పోలవరం సిబ్బందికి అనుమతిలేదు
- పూలబొకేల నిరాకరణ
- సీఎం చెంత ఈఎన్‌సీ, సెక్రటరీ, సీఈ

బాబు వచ్చారు..కళొచ్చింది..

రాజమహేంద్రవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఇక పరుగులు పెట్టనుంది. సీఎం నారా చంద్రబాబునాయుడు స్వయంగా ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించి పూర్తి చేయడానికి షెడ్యూల్ ప్రకటించారు. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు ప్రజల్లో కూడా ప్రాజెక్టు పూర్తవుతుందనే నమ్మకం ఏర్పడింది. సీఎం చంద్రబాబు స్వయంగా పనులు పరిశీలించడంతోపాటు అనేక విషయాలు ఆరా తీశారు. వ్యూపాయింట్ నుంచి స్పిల్‌వే, దానికి అవతల ప్రాజెక్టు కట్టబోయే ప్రాంతాన్ని పవర్ ప్రాజెక్టు పనులు పరిశీలించారు. తూర్పుగోదావరి వైపు జరుగుతున్న పవర్ ప్రాజెక్టును సీఎంకు ఈఎన్‌సీ చూపించడంతో అంతేనే ఇంకా ఎత్తు ఉంటుందా అని సీఎం అడగడంతో అంతేనని అధికారులు చెప్పారు. ఎగువ కాఫర్ డ్యామ్ నుంచి డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మించే ప్రాంతానికి చేరుకుని, అక్కడ జరుగుతున్న శాండ్ ఫిల్లింగ్, డయా ఫ్రంవాల్ నిర్మించే ప్రాంతంలో వైబ్రో కాంపాక్షన్, దిగువ కాఫర్ డ్యామ్ ప్రాంతం తిలకించారు. ప్రాజెక్టు మీద అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే సమయం గురించి అధికారుల సమీక్షలో చంద్రబాబు ఆరా తీశారు. 2027కి పూర్తి చేస్తామని అధికారులు చెప్పగా 2026 అక్టోబరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. ప్రాజెక్టు సివిల్ పనులు 2026 మేనెల, జూన్ నెలల నాటికి పూర్తి చేస్తే ఒక సీజన్ కోల్పోకుండా ఉండవచ్చన్నారు. 2026 నుంచి ప్రాజెక్టులో నీరు నిల్వ ఉండేలా చూడాలని చెప్పారు. మొదటి దశలో 41.15 కాంటూరు వరకూ రూ.12,157 కోట్లు ఖర్చుచేయగా అందులో రూ.2,345 కోట్లు కేంద్రం ఇచ్చిందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 7 లక్షల 27 వేల ఎకరాల ఆయకట్టు కొత్తగా సాగులోకి వస్తుందన్నారు. గత ఐదేళ్లలో నిర్వీర్యమైన ప్రాజెక్టుకు చంద్రబాబు రాకతో కళ వచ్చినట్టయింది.



సీఎం చంద్రబాబుకు ప్రాజెక్టు పనుల తీరును లాప్‌టాప్‌లో చూపిస్తున్న సిబ్బంది

నేటి నుంచి రాక్ పరీక్షలు

ప్రధాన డ్యామ్ ఎర్త్‌కమ్ రాక్ ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) నిర్మాణానికి చాలా రాక్ (రాయి) అవసరం ఉంటుందని, ఎక్కడెక్కడ ఏ రాయి ఉందో ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు చంద్రబాబుకు తెలిపారు.ఇక్కడ పనులకు అవసరమైన అనుమతులు పొందవలసిన అవసరం గురించి సమీక్షించారు. ముఖ్యంగా రాళ్ల నాణ్యతను పరిశీలించడానికి మంగళవారం ఒక నిపుణుల కమిటీ రానుంది. మూడు రోజులపాటు ఇక్కడే ఉండి, పలు రకాల రాళ్ల పరీక్ష చేస్తారు.

భద్రత కట్టుదిట్టం..

సీఎం పర్యటన భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎవరినీ సీఎం చెంతకు వెళ్లనీయలేదు. కనీసం నాయకులను పూలబొకేలు ఇచ్చేందుకు అనుమతించలేదు. తప్పని పరిస్థితుల్లో నాయకులు ఒకటి రెండు పువ్వులను ఇచ్చి సీఎంకు స్వాగతం పలికారు. సుమారు 800 మంది పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. కనీసం ఇరిగేషన్ ప్రాజెక్టులో క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేస్తున్న అధికారులను సీఎం వద్దకు వెళ్లకుండా రాజమహేంద్రవరానికి చెందిన ఓ డీఎస్పీ అడ్డుకున్నారు. దీంతో ఇరిగేషన్ అధికారులు అసహనానికి గురయ్యారు. సీఎం వద్దకు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతోపాటు ఇరిగేషన్ సెక్రటరీ, ఈఎన్‌సీ, సీఈలను మాత్రమే అనుమతించారు. మ్యాప్ చూపినపుడు, ఫొటో ఎగ్జిబిషన్‌లో కూడా సీఎంకు ఈఎన్‌సీ వెంకటేశ్వరావు వివరించి చెప్పారు. కనీసం వినతులివ్వడానికి ప్రజలను సీఎం చెంతకు వెళ్లనీయ లేదు. అది గమనించిన సీఎం వెనక్కి వచ్చి వినతులు తీసుకున్నారు. ఇతర ప్రజాప్రతినిధులకు వచ్చే డౌట్లు తీర్చడానికి ప్రాజెక్టులో పనిచేసే అధికారులు అందుబాటులో లేక ఇబ్బందిగా మారింది.



చంద్రబాబుకు పువ్వులు ఇస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

4 గంటలు ఇక్కడే..

ఉదయం సుమారు 11.45 గంటలకు హెలికాప్టర్ దిగిన వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతంపలికారు. మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు గులాబీ పూలతోనూ, పసుపురంగు పూలతోనూ స్వాగతం పలికారు. సుమారు 4 గంటలపాటు ప్రాజెక్టు ప్రాంతమంతా కలియతిరిగారు. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, పితాని సత్యనారాయణ, మద్దిపాటి వెంకట్రాజు, బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి, కలెక్టర్లు పి.ప్రశాంతి, వెట్రి సెల్వి, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



చంద్రబాబుకు పువ్వులు ఇస్తున్న బీవీఆర్ చౌదరి

ఉచిత ఇసుక పాలసీపై నిఘా పెట్టండి

పీజీఆర్ఎస్‌లో బీజేపీ వినతి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక మీ కోసం కార్యక్రమంలో 119 అర్జీలను అధికారులు స్వీకరించారు. వివిధ మండలాల నుంచి ప్రజలు ఫిర్యాదుదారులు తరలివచ్చారు. ఆన్‌లైన్‌లో 118 అర్జీలు, ఆఫ్‌లైన్‌లో ఒక అర్జీ స్వీకరించామన్నారు. ఉచిత ఇసుక పాలసీకి తూట్లు పడుతుందని తక్షణమే నిఘా పెట్టి అక్రమాలను అదుపు చేయాలని బీజేపీ నేతలు రొంగల గోపి శ్రీనివాస్ , యానపు యేసు, ఎన్‌వీబీఎస్ ఆచారి, భోగవల్లి రామారావు, పన్నాల వెంకటలక్ష్మీ, జగన్నాధ రావు డీఆర్‌వోను కలిసి వినతి పత్రం ఇచ్చారు.



సమస్య వింటున్న అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ

36 ఫిర్యాదుల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం.మురళీకృష్ణ స్వీకరించారు.జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులు స్వీకరించారు.ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు.వాటి పరిష్కారానికి వెనువెంటనే నేరుగా సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మొత్తం 36 ఫిర్యాదులను ప్రజల నుంచి స్వీకరించారు.

ఉపాధి.. ఊపిరితీసింది
ప్రమాద.. మంచు! 7
ప్రభుత్వ ప్రాజెక్టులు ఇప్పిస్తామని
రూ.57.75 లక్షలు కొట్టేశారు

అధికారులు.. భూచోళ్లు!



- అక్రమార్కులకు సహకారం
- పేదల అసైన్డ్ భూములపై కన్ను
- తక్కువ ధరకు కొనుగోళ్లు
- తిరిగి ప్రభుత్వానికే విక్రయం
- కోట్లాది రూపాయలు దోపిడీ
- నాటి ఐఏఎస్‌ల ప్రమేయం?
- ప్రభుత్వానికి ఫిర్యాదులు
- తూతూమంత్రంగా విచారణ
- తవ్వితే పెద్ద కుంభకోణమే
- అయినా నేటికీ తేలని వైనం

గత ఐదేళ్లూ అక్రమాలకు అడ్డేలేదు.. ఉన్నతాధికారులు అప్పటి ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి ఇష్టానుసారం పనిచేశారు. నిబంధనలు అతిక్రమించి మరి సహకరించేశారు. వైసీపీ నాయకులకు ఆడింది ఆట.. పాడింది పాటగా మారిపోయింది.. భూముల కొనుగోలు వ్యవహారాల్లో ఎక్కడైనా ఉన్నతస్థాయి అధికారులు ఉంటారా.. అది తూర్పుగోదావరి జిల్లాలో జరిగింది.. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు పేదల నుంచి తక్కువకు కొనుగోలు చేసి మళ్లీ ప్రభుత్వానికే అమ్మేసిన ఉదంతం జరిగింది.. ఈ మేరకు ఫిర్యాదులు అందాయి. అయినా ఎందుకో మరి.. నేటికీ ఆ ఫైలు కదలడంలేదు.. అధికారులపై చర్యలూ కానరావడంలేదు. విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారు.

గత ఐదేళ్లూ..అక్రమ భూ బదలాయింపులు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్యాష్ కొట్టు..ఏ పనైనా జరిగిపోద్ది ఒట్టు..జగన్ పాలనలో అధికారులు ఇలా చేసి చూపించారు..అక్రమాలకు తెరలేపారు.అసైన్డ్ భూములతో ఒక ఆటాడుకున్నారు.తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం,రాజమహేంద్రవ రం రూరల్, రాజానగరం, గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి నియోజకవర్గాల పరిధిలో చాలా అక్రమాలకు అప్పటి అధికార యంత్రాంగం తెరలేపింది. అడ్డదారిలో ప్రభుత్వ భూములు కట్టబెట్టేశారు. అప్పటి ప్రజాప్రతినిధు లు, ఉన్నతాధికారులు కలిసి కోట్లాది రూపాయలు మింగేశారు.

గత ఐదేళ్లూ అసైన్డ్ భూమాయం

వైసీపీ ప్రభుత్వం గడచిన ఐదేళ్లలో జిల్లాలోని అసైన్డ్ భూములతో కోట్లాది రూపాయల వ్యాపారం చేసింది. ఇందుకు సహకరించిన అధికారులకు కోట్లాది రూపాయల ముడుపులు ముట్టజెప్పింది.అసైన్డ్ భూములు కలిగిన ఎస్సీ, బీసీల నుంచి ఆయా భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని వేరొకరి పేరున రిజిస్ట్రేషన్ చేయించి అటుపై ఆయా భూములను ఇళ్ల స్థలాలకు ప్రభుత్వానికి అమ్మి అందులో కోట్లాది రూపాయ లను అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు మూకుమ్మడిగా దోచేశారు. ఇందు కోసం హైదారాబాద్ పరిసర ప్రాంతాలకు చెందిన్ జగన్ బ్యాచ్‌ను వినియోగించారు. రాజానగరం మండలం కానవరం గ్రామంలో సర్వే నెం 235/2బీలో 6.76 ఎకరాల అసైన్డ్ భూమిని 2023 నవంబరు 22న అప్పటి ఉన్నతాధికారులు పేద ఎస్సీ రైతు నుంచి బినామీ వ్యక్తి పేరున ఎకరం రూ.30 లక్షలకు కొనుగోలు చేశారు. దీనికి సంబంధించి డాక్యుమెంట్లు నెంబరు 10779/ 2023, 10780/2023, 10919/2023గా ఎస్ఆర్‌వో రాజానగరం (427)గా రిజిస్ట్రర్ చేశారు.ఈ ప్రక్రియ పూర్తయిన 20 రోజుల్లో ఇదే భూమిని ప్రభుత్వంతో ఎకరానికి రూ.64 లక్షలు చొప్పున మొత్తం రూ4.27 కోట్లకు కొనుగోలు చేయించారు. అదే విధంగా సర్వేనెంబరు 569,570,571,572లలో ఉన్న పేదల భూములు సుమారు 22 ఎకరాలను అతి తక్కువ ధరకు బినామీల పేరిట కొనుగోలు చేయించి వాటిని వారం వ్యవధిలో ప్రభుత్వానికి అమ్మించారు. ఇలా ఇదే మండలంలో సుమారు వందల కోట్ల వ్యాపారం చేశారు.ఇందులో పూర్తిగా ఉన్న తాధికారులు సహకరించారు. కల్వచర్లలో సుమా రు 10 ఎకరాలు, మల్లంపూడిలో సుమారు 10 ఎకరాలు, కానవరంలో సుమా రు 20 ఎకరాల భూములను తారుమార్ తక్కెడమార్ చేసి కోట్లాదిరూపాయలు నొక్కేశారు. ఇందులో నిజమైన రైతులకు కేవలం లక్షల్లో దక్కగా మధ్యవర్తులు, అధికారులు మాత్రం కోట్లు దండుకున్నారు.కొవ్వూరు డివిజన్‌లో చుక్కల భూముల వ్యవహారంలో న్యాయస్థానం నిబంధనలు బేఖాతర్ చేసి బొక్కేసినట్టు తెలిసింది. దీనికి కూడా అప్పటి కలెక్టర్ పూర్తిగా సహకరించారు. గోపాలపురంలో కొండల మాటున గప్‌చుప్‌గా భూములను కొట్టేశారు. అసలు రైతులకు చుక్కలు చూపిస్తున్నారు.

> **ఈజీగా అసైన్డ్ భూమార్పిడి..**
>
> అసైన్డ్ భూ ములు క్రయవిక్రయాలు చేయకూడదు.. ఆసైన్డ్ భూమిని మార్పుచేయాలంటే చాలా పెద్ద ప్రాసెస్ ఉంటుంది. అలాంటిది కేవలం వారం పది రోజుల వ్యవధిలో అధికారులు భూమార్పిడిని పూర్తి చేసేశారు. ఎందుకంటే వాళ్లే రియల్ వ్యాపారులుగా మారితే..ఇంక అడ్డేముంది! అందుకే ఇష్టానుసారం మార్చేశారు. కోట్లు కొట్టేశారు.

రూరల్‌లో భూములూ అంతే

రాజమహేంద్రవరం రూరల్ మండలంలో గతంలోను భూముల స్కామ్‌లు జరిగాయి. ఇటీవల ధవళేశ్వరం ఎర్రకొండ ప్రాంతంలో ఉన్న ఆసైన్డ్ భూమిలో ఇళ్ల పట్టాలకు గతంలో కేటయించారు. సుమారు 83 సెంట్ల భూమిని వెబ్ ల్యాండ్‌లో వ్యవసాయ భూమి కింద మార్చి కన్వర్షన్ కట్టి కడియం మండలానికి చెందిన వ్యక్తికి ఒక ఆసామికి అమ్మినట్టు చేసి దానిలో కొబ్బరి చెట్లను తొలగించి ఆగమేఘాలపై లేఅవుట్ వేసేశారు. దీనికి పూర్తి రూరల్ రెవెన్యూ అధికారులు సహకరించారు.ఇక ధవళేశ్వరంలో ఇరిగేషన్ భూములు అన్యాక్రాంతమైపోతున్నా కన్నెత్తి చూసే వారే కరువయ్యారు. మెయిన్‌రోడ్డును ఆనుకుని స్థలాలు కబ్జా చేసి షాపులు కట్టేసుకుంటున్నా కళ్లప్పగించి చూస్తున్నారు.అదేవిధంగా పిడింగొయ్యి పంచాయతీ పరిధి జాతీయ రహదారి సమీపంలో ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రిహోల్డ్ జీవోతో బినామీలకు కట్టబెట్టి అటుపై పెద్దవాళ్ళకు బదాయించే ప్రయత్నాలు జరిగాయి. ఇటీవల విచారణ కూడా నిర్వహించి పెండింగ్‌లో పెట్టారు.దీనిపై 9 వరకు కోర్టు కేసులు ఉన్నట్టు తెలిసింది. ఈ వ్యవహారాల్లో నేరుగా కలెక్టర్ కార్యాలయం అధికారులు కీ రోల్ పోషించినట్టు తెలిసింది. మోరంపూడిలో ఉన్న లేఅవుట్‌కు సంబంధించి పేర్ల మార్పులో కూడా కుంభకోణం జరిగింది. దీంతో మండలస్థాయిలో ఒక రెవెన్యూ అధికారి కీలకంగా వ్యహరించి కలెక్టర్ కార్యాలయంలో చక్కబెట్టినట్టు తెలిసింది. హుకుంపేట సెంటర్‌లో ఉన్న జమిందార్ల భూమిని కొందరికి కట్టబెట్టేందుకు కమిషన్‌కు కక్కుర్తిపడినట్టు తెలిసింది.హుకుంపేట గ్రామంలో శాటిలైట్ సిటీకి వెళ్లే ప్రాంతంలో కూడా జమిందార్ భూముల రికార్డులను మార్పులు చేసి కొంతమందికి కట్టబెట్టడంతో అక్కడ లేఅవుట్లు వేశారు. కోలమూరు పరిధిలో గామన్‌వంతెన చాగల్నాడు పైప్ సమీపంలో కాలువ భూములు మాయం చేసి లేఅవుట్లు వేశారు. ఇలా భూములను కొల్లగొట్టేశారు.

రాజమహేంద్రవరంలో

రాజమహేంద్రవరంలో కూడా అక్రమ వ్యవహారాలు చాలా జరిగాయి. గత ప్రభుత్వ హయాంలో టీటీడీ రహదారిలో ఉన్న ప్రభుత్వ భూమిని ఒక ఆసామి సుమారు 30 ఏళ్ళకు లీజుతీసుకున్నాడు. దానికి సంబంధించి లీజు గడువు గతేడాది ముగిసింది. ఆ ఆసామి కూడా మరణించాడు. అయితే ఈ లీజును మరొక 30 ఏళ్ల పాటు ఆ ఆసామి వారసుల పేర పొడిగించేందుకు గత ప్రభుత్వంలో జిల్లా ఉన్నతాధికారులు రూ.30 లక్షలు తీసుకుని లీజును పొడిగించినట్టు తెలిసింది. అదేవిధంగా రాజమహేంద్రవరం గౌతమి సూపర్‌బజార్ కోఆపరేటివ్ సొసైటీకి చెందిన భూమి నగరం నడిబొడ్డున ఉంది. దానిని అప్పటికే ఒక వ్యక్తికి 11 ఏళ్ళపాటు లీజుకు ఇచ్చి అతని నుంచి మరొక వ్యక్తికి 33 ఏళ్ళపాటు సబ్ లీజుకు ఇచ్చేందుకు కూడా ఇదే అధికారులు పూర్తిగా సహకరించి డబ్బులు తీసుకున్నట్టు సమాచారం. ఇదే విషయాన్ని గుర్తించి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేశారు.దీనిపై విచారణ జరపాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంలో పూర్తిగా వైసీపీ ప్రజాప్రతినిధులు కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. ఇలా నగరంలో అనేక భూకుంభకోణాలు, అక్రమలీజులు చోటు చేసుకున్నట్టు తెలిసింది. ఇవి ఒక్కొక్కటిగా బయటకువస్తున్నాయి.

ఉన్నతాధికారులపై విచారణకు ఆర్‌డీవో స్థాయి అధికారులా?

రాజానగరం మండలంలో జరిగిన భూ అక్రమాల్లో అప్పటి కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌పై విచారణ వేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్వతంత్ర జనతా పార్టీ నేత బర్రే ఆనంద్ కుమార్ కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు.ఈ మేరకు ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.అయితే కలెక్టర్లపై చేసిన ఆరోపణలకు ఆర్‌డీవో, మైన్స్‌ఏడీ, ఇరిగిషనల్ ఎస్ఈలతో కూడిన అధికారులను విచారణాధికారులుగా నియమించడం పలు విమర్శలకు తావిస్తోంది. కలెక్టర్ స్థాయి అధికారులపై వచ్చిన ఆరోపణలను విచారించి నిగ్గుతేల్చేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించాల్సి ఉండగా దానికి విరుద్ధంగా కమిటీ వేయడంపైన ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ప్రభుత్వాలు మారినా అధికారుల తీరులో మార్పురాకపోవడం శోచనీయం.

రైలు ప్రయాణికుల.. రక్షణ కవచం



ఆంధ్రజ్యోతి/సామర్లకోట

రైలు ప్రమాదాలు.. ఈ మాట మనం అప్పుడప్పుడూ వింటుంటాం.. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాల కారణంగా ఈ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఒకే ట్రాక్‌పైకి రెండు రైళ్లు రావడం.. అవి ఢీకొనడం.. లేదా రైలు పట్టాలు తప్పడం అనేవి ప్రధాన కారణాలు. ఇలాంటి ఘటనల్లో పదుల సంఖ్యలో ఒక్కోసారి వందల సంఖ్యలో కూడా ప్రాణాలు పోతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రమాదాల నివారణకు రైల్వే శాఖ 'కవచ్' అనే విధానాన్ని తీసుకువచ్చింది. మన ఉమ్మడి జిల్లా పరిధిలో తుని నుంచి నిడదవోలు వరకు 130 కిలోమీటర్ల మేర పలు రైల్వేస్టేషన్ల మీదుగా రైల్వే ట్రాక్‌లు విస్తరించి ఉన్నాయి. వందల సంఖ్యలో రైళ్లు ప్రయాణాలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన ప్రాంతంలో 'కవచ్' ఆవశ్యకత గురించి తెలుసుకుందాం..

- ప్రయాణికుల భద్రతకు పటిష్ట వ్యవస్థ 'కవచ్'
- దక్షిణ మధ్య రైల్వేలో విజయవంతంగా అమలు
- ఉమ్మడి జిల్లాలో తుని-నిడదవోలు వరకు 130 కిలోమీటర్ల మేర విస్తరించిన రైల్వేలైన్లు
- నిత్యం రాకపోకలు సాగిస్తున్న 120 రైళ్లు

రైల్వేతో ఎంతో అనుబంధం

గోదావరి జిల్లాల ప్రజలకు రైల్వేతో ఎంతో అనుబంధం ఉంది. అటు విశాఖ వైపు, ఇటు విజయవాడ వైపు అనేక అవసరాల దృష్ట్యా ఎన్నో ఏళ్లుగా ప్రజలు రైళ్లలో ప్రయాణాలు సాగిస్తున్నారు. సాధారణ ప్రయాణాలు, వ్యాపార అవసరాలు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, చదువుల నిమిత్తం, ఆధ్యాత్మిక, పర్యాటక గమ్యస్థానాలు చేరుకోవడానికి.. ఇలా రకరకాల కారణాలతో చాలా మంది నిత్యం రైలు ప్రయాణాలు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ రాష్ట్రాల ప్రజలు సుదూర ప్రయాణాల్లో భాగంగా మన జిల్లా మీదుగా రైళ్లలో ప్రయాణిస్తుంటారు. ఇలా కొన్ని లక్షల మంది ప్రజలను కొన్ని వందల రైళ్లు మన జిల్లా మీదుగా తమ గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. విశాఖనుంచి వచ్చే రైళ్లు కాకినాడ జిల్లా తునిలో ప్రారంభమై అన్నవరం, చేబ్రోలు, గొల్లప్రోలు, పిఠాపురం, సామర్లకోట చేరుకుంటాయి. ఇక్కడినుంచి కాకినాడ వరకు ప్రత్యేక లైను ఉంది. సామర్లకోట మీదుగా మేడపాడు, తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు, అనపర్తి, ద్వారపూడి, జేగురుపాడు, వేమగిరి, కడియం, రాజమహేంద్రవరం చేరుకుంటాయి. ఇక్కడ రాజమహేంద్రవరం టౌన్‌తోపాటు గోదావరి స్టేషన్ కూడా ఉంది. ఇక్కడ రైల్వేలైను రోడ్‌కం రైలు బ్రిడ్జి మీదుగా, మరోలైను గోదావరి ఆర్ బ్రిడ్జి మీదుగా కొవ్వూరు-పశివేదల- నిడదవోలు చేరుకుంటాయి. అక్కడినుంచి భీమవరం మీదుగా ఒకటి, ఏలూరు మీదుగా మరొకటి విజయవాడకు చేరుకుంటాయి.



సామర్లకోట రైల్వేస్టేషన్‌లో రైళ్ల ఆపరేటింగ్ సిస్టమ్

కవచ్ పనిచేసే విధానం

కవచ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలంటే లోకో పైలె ట్ల ఇంజన్ ఛాంబర్‌లో ప్రత్యేకమైన కవచ్ సాఫ్ట్ వేర్‌ను ఇన్‌స్టాల్ చేస్తారు. ట్రాక్ వెంబడి ఉన్న ప్రతి రైల్వేస్టేషన్‌లోను కవచ్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్ స్టాలేషన్ చేస్తారు. ట్రాక్ పొడవునా టెలీకమ్యూనికేషన్ టవర్లను నెలకొల్పుతారు. ట్రాక్‌ల వెంబడి ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లను అమర్చుకుంటూ వెళ్తారు. ఈ వ్యవ స్థలు నిరంతరాయంగా పనిచేస్తాయి. ఒకే ట్రాక్‌లో నిర్దిత సమయంలో ఎదురెదురుగా రైళ్లు వస్తుంటే చాలా దూరం నుంచే కవచ్ పసిగట్టి వెంటనే పైలెట్లకు వీడియో, ఆడియోలతో కూడిన ప్రమాద సంకేతాలను అందిస్తుంది. ఒకవేళ లోకో పైలట్ ప్రతిస్పందించకపోతే కవచ్ సిస్టమ్ ఆటోమేటిక్‌గా పనిచేస్తుంది. వెంటనే రైళ్ల వేగాన్ని తగ్గించేస్తుంది. రైల్వేట్రాక్ వెంబడి ఉన్న ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లు ఎప్పటికప్పుడు కవచ్‌కు వాటి స్థితిగతుల గురించి సమాచారాన్ని ఇస్తాయి. దీంతో రియల్ టైమ్ డేటా ఆధారంగా కవచ్ పనిచేస్తూ రైళ్లను ఢీకొనకుండా నియంత్రిస్తాయి.

ఎల్‌హెచ్‌బీ భోగీ కొంతవరకే పరిమితం

ఒకేట్రాక్‌పై రెండు రైళ్లు ఎదురెదురుగా దూసుకురావడంవల్ల 90శాతం రైలు ప్రమాదాలు జరుగుతున్నాయి. రైలు పట్టాలు తప్పినా ప్రమాదం జరుగుతుంది. ప్రస్తుతం అందుబాటులో కి తీసుకువచ్చిన ఎల్ హెచ్‌బీ భోగీల కారణంగా పట్టాలు తప్పినా అవి బ్యాలెన్స్ చేసుకుంటున్నాయి. ఒకే ట్రాక్ పై ఎదురెదురుగా 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో దూసుకువచ్చే రైళ్లు ఢీకొంటున్నప్పుడు మాత్రం ఎల్‌హెచ్‌బీ బోగీలైనా ప్రయాణికులు చనిపోతున్నారు. ఈ బోగీలు కేవలం పట్టాలు తప్పితే మాత్రమే బ్యాలెన్స్ చేయడానికి పరిమితమవుతున్నాయి. ఒకే ట్రాక్‌పైకి రెండు రైళ్లు సిగ్నలింగ్‌లో సమస్యలు ఉన్నప్పుడే వస్తుంటాయి. మాన్యువల్‌గా ఇచ్చే సిగ్నళ్లలో ఏమాత్రం పొరపాటు జరిగినా ఒకే ట్రాక్‌పైకి రెండు రైళ్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. దీన్నిదృష్టిలో ఉంచుకుని ఇటీవల కాలంలో తక్కువ దూరంలో మరిన్ని సిగ్నల్స్ ఏర్పాటు, ఆటోమేటిక్ సిగ్నలింగ్ సిస్టమ్ వం టివి ఏర్పాటు చేస్తున్నారు. ఇవి చాలా వరకూ సత్ఫలితాలు ఇస్తున్నా ఇటీవల కాలంలో తాజాగా చెన్నైలో జరిగిన ప్రమాదం.. ఇంకా పటిష్టమైన వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన పరిస్థితిని చాటి చెబుతోంది. ఇందులోభాగంగా కవచ్‌ను దక్షిణ మధ్య రైల్వే అధికారులు విజయవంతంగా పరీక్షించారు. ఒకే ట్రాక్‌పైకి రెండు రైళ్లు దూసుకువస్తుంటే ఈ వ్యవస్థవల్ల పైలెట్లతో సంబంధం లేకుండా రైలు వేగాన్ని తగ్గించి వాటిని నిలుపుదల చేస్తుంది. దీని సాంకేతిక విధానాలను ఆంధ్రజ్యోతికి ఒక రైల్వే ఉన్నతాధికారి వివరించారు.



సామర్లకోట రైల్వేస్టేషన్‌లో రైళ్ల రాకపోకలు

కవచ్ అంటే ఏంటి?

కవచ్‌ను యాంటీ కొలిజన్ సిస్టమ్ అని కూడా పిలుస్తారు. రైళ్ల భద్రతను పెంచేందుకు పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో దీన్ని రూపొందిం చారు. ఒకే ట్రాక్‌పైకి ఎదురెదురుగా వచ్చే రైళ్ల ప్రమాదాలను నివారిం చడం, వెనుక నుంచి రైళ్లు ఢీకొనడం, అతివేగం కారణంగా పట్టాలు తప్పడం ఎదురెదురుగా వచ్చే వాటిని ఢీకొనాల్సిన పరిస్థితుల్లో ప్రమాదాలను నివారించే వ్యవస్థ ఈ కవచ్. ఆటోమేటిక్ బ్రేకింగ్ సిస్టమ్(ఏబీఎస్), ఆటోమేటిక్ వార్నింగ్ సిస్టమ్, రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్(ఆర్ఎఫ్ఐడీ) ట్యాగ్‌లు, జీపీఎస్-జీఎస్ఎం కమ్యూనికేషన్స్ మిళితంగా కవచ్ వ్యవస్థ ఆధారపడి పనిచేస్తుంది.



సామర్లకోటలో ఆగిన రైలులో లోకోపైలట్ క్యాబిన్

మనకీ.. కవచ్ అవసరం

కవచ్ వ్యవస్థను మొదటిసారిగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోనే ప్రయోగాత్మకంగా ప్రారంభించి విజయవంతంగా అమలు చేస్తున్నారు. కవచ్ వ్యవస్థ అమల్లో ఉన్న ట్రాక్‌ల్లో ప్రమాదాలు దాదాపుగా తగ్గాయి. ఇటీవలకాలంలో రైళ్లు సమయపాలనతో నడుస్తున్నాయి. నిర్వహణ ఖర్చులు తగ్గుతున్నాయి. దేశంలోనే అతిపెద్ద రైల్వేడివిజన్‌గా ప్రసిద్ధి పొందిన విజయవాడ రైల్వేడివిజన్ పరిధిలో రాజమహేంద్రవరం, సామర్లకోట మీదుగా ప్రతిరోజూ ప్రయాణికులకు, రవాణా అవసరాలకు 120 రైళ్ల వరకూ రాకపోకలు సాగిస్తున్నాయి. కాకినాడ నుంచి ప్రయాణికుల రైళ్లే కాకుండా రవాణా రైళ్లు కూడా అధికంగానే రాకపోకలు సాగిస్తున్నాయి. తీవ్ర రద్దీ దృష్ట్యా ఈ మార్గంలో భవిష్యత్తులో ఉపద్రవాలను నివారించాలంటే కవచ్ వంటి వ్యవస్థ ఎంతో కీలకంగా మారింది.

మెరుగైన చేతిరాతతో ఉజ్వల భవిత

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

పిఠాపురంలో విద్యార్థుల చేతిరాత మెరుగుపరిచే నైపుణ్య కార్యక్రమం



పిఠాపురంలో నైపుణ్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్

పిఠాపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి మెరుగైన చేతిరాతతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. భారతీరంగా ఆర్గనైజేషన్ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ సొసైటీ (బ్రోవ్స్) సంస్థ వ్యవస్థాపకుడు వెంకట శ్రీధర్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 12వేల మంది విద్యార్థుల చేతిరాతను మెరుగుపరిచే నైపుణ్య కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల చేతిరాత మెరుగపరిచే విధంగా శిక్షణ ఇవ్వడంతో పాటు అందుకు అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రిని ఉచితంగా ఇచ్చేందుకు బ్రోవ్స్ సంస్థ ముందుకురావడం అభినందనీయమన్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. చేతిరాతను మెరుగుపరుచుకోవడం ద్వారా తమ భవిష్యత్తును విద్యార్థులు ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలుగుతారని, ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ కుమార్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు), జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, డీవైఈవో వెంకటేశ్వరరావు, మునిసిపల్ కమిషనర్ కనకారావు తదితరులున్నారు.

కాకినాడ 'పీఆర్'లో జాతీయస్థాయి సదస్సు



సదస్సులో హిందీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కాకినాడ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యం అధ్యక్షతన కళాశాల తెలుగు,హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.హరిరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. గౌరవ అతిథులుగా ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ పి.ప్రేమానందం, మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జీవీ రత్నాకర్ విశిష్ట అతిథులుగా.. సినీ సంగీత దర్శకులు సాలూరు వాసూరావు, గురజాడ అప్పారావు ముని మనవడు డాక్టర్ మోపిదేవి విజయగోపాల్ పాల్గొనగా డాక్టర్ నల్ల పవన్‌కుమార్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా యువతలో దేశభక్తి పెంపొందుతుందన్నారు. ఏఎస్ యూ పూర్వపు రెక్టార్ ప్రొఫెసర్ వరప్రసాద మూర్తి అభ్యుదయ సాహిత్యంపై ప్రసంగించారు. అనంతరం అతిథులు డాక్టర్ పి.హరిరామ్‌ప్రసాద్ రచించిన హిందీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలుగు, హిందీ వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధక విద్యార్థులు, కళాశాల విద్యార్థులు తెలుగు, హిందీ భాషల్లో తమ పరిశోధక పత్రాలను సమర్పించారు.

28న విద్యార్థులకు చాగంటి ప్రవచనం



చాగంటిని శాలుశాతో సత్కరించి పూల బొకే అందజేస్తున్న శ్రీ విజయ్

కాకినాడ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే పదో తరగతి పరీక్షలు నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యార్థుల నైతిక విలువల ప్రభుత్వ సలహాదారు, ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు ఈనెల 28న విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ మేరకు ఎంఎస్ఎన్ విద్యాసంస్థల డైరెక్టర్, యునైటెడ్ ప్రైవేటు ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ రాష్ట్ర లీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ ప్రవచన కర్త చాగంటిని మర్యాదపూర్వకంగా కలిసి వచ్చే పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించాలని కోరగా అంగీకరించారు. కాకినాడ రాజాట్యాంక్ పార్కు వద్ద గల ఫ్యాబిన్ కన్వెక్షన్ హాల్‌లో ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది.చాగంటిని శాలువాతో శ్రీవిజయ్ సత్కరించారు.

ఒత్తిడిని దూరం చేసేందుకే క్రీడా పోటీలు

ఏపీఎస్పీ కమాండెంట్ ఎం.దీపిక

ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణంలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 ప్రారంభం



రన్నింగ్ పోటీలను తిలకిస్తున్న కమాండెంట్ దీపిక

సర్పవరం జంక్షన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో దేహ దారుఢ్యం.. మానసికోల్లాసం లభిస్తుందని ఏపీఎస్పీ కమాండెంట్, ఐపీఎస్ అధికారిణి ఎం.దీపిక అన్నారు. కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణంలో సోమవారం యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో బెటాలియన్ పోలీసులు బిజీగా ఉంటారని, కుటుంబాలకు దూరంగా ఉంటూ విధులు నిర్వహిస్తుంటారన్నారు. ఒత్తిడిని దూరం చేసేందుకు ఏటా బెటాలియన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహిస్తూ సిబ్బంది, అధికారుల్లో నూతనోత్సాహం నింపడం జరుగుతుందన్నారు. ప్రతీ రోజూ వ్యాయామం చేస్తున్నా క్రీడలు ఆడటం వల్ల ఫిజికల్‌గా ఫిట్‌గా ఉంటా మన్నారు. పోలీసుశాఖలో ఫిజికల్ ఫిట్‌నెస్ ఎంతో ముఖ్యమన్నారు. ముందుగా బెటాలియన్‌లో ఉన్న 7కంపెనీల స్పోర్ట్స్ సిబ్బంది మార్చి ఫాస్ట్ నిర్వహించగా సిబ్బంది నుంచి కమాండెంట్ గౌరవ వందనం స్వీకరించి, గాల్లోకి బెలూన్స్ విడిచిపెట్టి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాలీబాల్, రన్నింగ్, లాంగ్ జంప్ పోటీల్లో సిబ్బంది రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. కార్యక్రమంలో ఐపీఎస్ అధికారిణి ఆర్.సుస్మిత, అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు డి.మురళీకుమార్, ఎం.మోహన్‌రావు, బిఎస్.చంద్రశేఖరరావు, ఎస్.మన్మథరావు, యూని ట్ మెడికల్ ఆఫీసర్లు సునీల్, లక్ష్మి, ఆర్ఐలు కె.రవిశంకర్, బి.విఠలేశ్వరరావు, ప్రసాద్, యూనిట్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లాంగ్ జంప్ పోటీలు



వాలీబాల్ పోటీలు

బలమైన పునాదులతో అద్భుత ఫలితాలు

ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

దివాన్‌చెరువు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు భాష, గణితంలో పునాది బలంగా ఉంటేనే అద్భుతమైన ఫలితాలు సాధించగలరని ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కేంద్రం కోఆర్డినేటర్, కోనసీమ జిల్లా సమగ్రశిక్షా ఏఎంవో పి.రాంబాబు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరులోని సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్ 5వ దశ ఆరు రోజుల శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలన్నారు. 2030 నాటికి సాధించాల్సిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నాణ్యమైన విద్యను అందించాల్సిన విషయాన్ని నూతన జాతీయ విధానం స్పష్టం చేసిందన్నారు. ప్రథమ్ సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ జగదీష్, డైట్ పరిశీలకులు సుజాతారత్నం మాట్లాడుతూ విద్యార్థి దశలో మొదటి ఎనిమిదేళ్ల ప్రారంభ సంవత్సరాలని, ఇది అత్యంత కీలకమైన దశగా పేర్కొన్నారు. ఈ దశలోనే మానసికాభివృద్ధి, అభ్యసన వేగంగా ఉంటాయన్నారు. సమావేశంలో డైట్ లెక్చరర్ గంగాధరరావు, ఎంఈవోలు కె.తిరుమలరావు, సీహెచ్ ఆంజనేయులు మాట్లాడారు. ఈ ఐదో బ్యాచ్‌లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 270 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందనున్నట్లు కోఆర్డినేటర్ రాంబాబు తెలిపారు. సమావేశంలో ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్లు అనూష, జీవన్, కేఆర్‌పీలు కె.గంగాధరరావు, ఎం.రాంబాబు, వెన్యూ ఆర్గనైజర్ పవన్, 18మంది డీఆర్పీలు ఉన్నారు.

ఎయిమ్స్ పరీక్షలో అన్వితకు మొదటి ర్యాంకు



మీడియాతో మాట్లాడుతున్న అన్విత

కాకినాడ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చంటిపిల్లల వైద్యశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని పీడీయాట్రిక్ న్యూరాలజీ స్పెషాలిటీ కోర్సు చేసేందుకు ఎయిమ్స్ నిర్వహించిన జాతీయ స్థాయి పరీక్షలో కాకినాడ భానుగుడి ప్రాంతానికి చెందిన డాక్టర్ అన్విత రాళ్లపల్లి మొదటి ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్విత సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఈ కోర్సులో చేరేందుకు ఎంట్రన్స్ కోటాలో 2 సీట్లు మాత్రమే ఉంటాయని తెలిపారు. ప్రణాళికబద్ధంగా చదవడంతో పాటు ఉపాధ్యాయులు మంచి కోచింగ్ అందించారన్నారు. అదేవిధంగా తన తల్లిదండ్రులు డాక్టర్ చక్రపాణి, డాక్టర్ సరస్వతిలు అందించిన ప్రోత్సాహం వల్ల జాతీయస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించగలిగానన్నారు. వైద్య విద్య పూర్తయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోనే వైద్య సేవలు అందిస్తానని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని పలువురు ప్రముఖులు, వైద్యులు అన్వితను అభినందించారు.

కోట సత్తెమ్మకు చీర,సారె సమర్పణ



కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అధికారులు



చీర సారె తీసుకువస్తున్న మద్ది ఆంజనేయస్వామి, నిడదవోలు నాంగల్యాదేవి దేవస్థానాల ప్రతినిధులు

నిడదవోలు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ తల్లి తిరునాళ్లలో భాగంగా రెండోరోజు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. గుర్వాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం, నిడదవోలులోని నాంగల్యాదేవి దేవ స్థానం అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు కోటసత్తెమ్మకు చీర,సారె సమర్పించారు. వారికి దేవస్థానం తరపున మేళతాళాలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించి చీరసారె సమర్పించారు. భక్తులు పాల్గొన్నారు.

'శ్రీప్రకాష్'లో ఉత్సాహంగా జోష్



అతిథులతో శ్రీప్రకాష్ మేనేజింగ్ డైరెక్టర్ విజయప్రకాష్

దివాన్‌చెరువు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలకు సమాజం పట్ల, పర్యావరణం, జీవితం, అత్యున్నతమైన వాటి పట్ల అవగాహన కల్పించాలని ప్రఖ్యాత కవి, రచయిత, ఐఏఎస్ ట్రైనర్ ఆకెళ్ల రాఘవేంద్ర అన్నారు. దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ 12వ వార్షికోత్సవం (జోష్) సోమవారం సాయంత్రం ఉత్సాహంగా సాగింది. శ్రీప్రకాష్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆకెళ్ల ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఏదైనా కార్యక్రమాలు జరిగినపుడు పుస్తకాలను బహుమతులుగా ఇద్దామని, పిల్లలతో పుస్తకాలను చదివించాలని కోరారు. మరో ముఖ్యఅతిథి రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి మాట్లాడుతూ విద్యఎంతో బలమైన ఆయుధమని అన్నారు. మరో ముఖ్యఅతిథి జీఎస్ఎల్ సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ పిల్లలు సెల్‌ఫోన్ మోజులో పడవద్దు అని, తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని హితవు పలికారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ విజయప్రకాష్ తమ పాఠశాల నివేదికను సమర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన అటల్ టింకరింగ్ ల్యాబ్ వైజ్ఞానిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, మేనేజర్ ఏవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయంలో..

ఫ్రాన్స్ దేశస్తులు

- స్వామి సన్నిధిలో రెండేళ్ల బాలుడి తలనీలాల సమర్పణ
- తిరునామాలు సమర్పించి స్వామివారి దర్శనం



ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఫ్రాన్స్ దేశస్తులు

ఆత్రేయపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని సోమవారం ఫ్రాన్స్ దేశానికి చెందిన భక్తులు దర్శించుకున్నారు. వీరి పూర్వీకులు ఈ ప్రాంతానికి చెందినవారే కావడంతో స్వామి విశిష్ట తను ఫ్రాన్స్‌కు చెందిన మహిళలు తెలుసుకున్నారు. వీరిలో ఓ మహిళకు రెండేళ్ల బాలుడు ఉన్నాడు. అతడికి తొలి పుట్టివెంట్రుకలను ఆలయంలో స్వామివారి సన్నిధిలో సమర్పించారు. ఆ బాలుడు గుండుకు గంధం కూడా పూయించారు. వారంతా తిరునామాలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయం మొత్తం తిరిగి ఫ్రాన్స్ దేశస్థులు సందడి చేశారు. భక్తులు వారిని ఆసక్తిగా తిలకించారు. విదేశాలనుంచి వచ్చి ఇక్కడి సంప్రదాయాలను గౌరవించడంపై అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

52 కిలోల గంజాయి పట్టివేత

- రెండు వేర్వేరు కేసుల్లో పట్టుకున్న చింతూరు పోలీసులు



పట్టుబడిన గంజాయి నిందితులతో చింతూరు పోలీసులు



గంజాయి తరలింపు కోసం వ్యాన్‌లో ఏర్పాటు చేసిన అర

చింతూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు కేసుల్లో సోమవారం చింతూరు పోలీసులు 52 కిలోల గంజాయి పట్టుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఎస్ఐ పి.రమేష్ తెలిపిన వివరాలు ఇలా.. తమిళనాడుకు చెందిన ముగ్గురు వ్యక్తులు సీలేరులో 50 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. గంజాయి ఎవరి కంటా కనపడకుండా ఉండేందుకని ఒక వ్యాన్‌లో ప్రత్యేక అర ఏర్పాటు చేసి అందులో గంజాయి ప్యాకెట్లను అమర్చారు. అనంతరం చింతూరు మీదుగా తమిళనాడుకు వెళ్లే యత్నం చేశారు. కాగా పోలీసులకు అందిన సమాచారం మేరకు చేపట్టిన వాహన తనిఖీల్లో గంజాయి రవాణా బయటపడిందని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు గంజాయితోపాటు వ్యాన్, ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఒక వ్యక్తి రెండు కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడినట్లు ఎస్ఐ తెలిపారు. రెండు కిలోలు తరలిస్తూ పట్టుబడిన వ్యక్తి గంజాయి మత్తుకు అలవాటు పడ్డట్టు విచారణలో స్పష్టమైందని ఎస్ఐ తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మంచు.. ముంచుతోంది!

- రోడ్డు కనిపించక ప్రమాదాలు
- తూర్పుగోదావరి జిల్లా అనంతపల్లి వద్ద రెండు రోజుల్లో రెండో ప్రమాదం
- వ్యాన్‌ని వెనుక నుంచి ఢీకొట్టిన బస్సు
- నుజ్జునుజ్జయిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు



నుజ్జు నుజ్జు అయిన ప్రైవేటు ట్రావెల్ బస్సు

నల్లజర్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మంచు కారణంగా రోడ్డు కనిపించకపోవడంతో రాత్రిసమయాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి హైవేపై ప్రమాదకరంగా మారింది. శనివారం తెల్లవారుజామున ఒక ప్రైవేట్ ట్రావెల్ బస్ ప్రమాదానికి గురికాగా.. సోమవారం తెల్లవారుజామున మరో ప్రైవేటు ట్రావెల్ బస్ ప్రమాదానికి గురైంది. రెండు ప్రమాదాల్లోనూ ప్రయాణికులు క్షేమంగా బయటపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. గుంటూరు నుంచి విశాఖపట్నం 40మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు అనంతపల్లి చేరుకున్న సమయంలో మంచు ప్రభావం ఎక్కువైంది. దీంతో ముందు ఉన్నవి కనిపించకపో వడంతో రన్నింగ్‌లో ఉన్న ఐసర్ వ్యాన్‌ని ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు యింది.ప్రయాణికులకు ఏటువంటి గాయాలు కాకపోవడంతో పోలీసులు మరొక బస్సులో వారిని గమ్యస్థానాలకు పంపించి వేశారు.సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

పోలీసులకు సైతం అంతుచిక్కని హత్యలు

- వేట్లపాలెం ఘటనపై జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సీరియస్
- ముగిసిన పోస్టుమార్టం ప్రక్రియ

సామర్లకోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వేట్లపాలెంలో దళిత సామాజికవర్గానికి చెందిన రెండు కుటుంబాల మధ్య దాడుల సంఘటనపై జిల్లా పోలీసు పోలీసు ఉన్నతాధికారి సామర్లకోట పోలీసు అధికారిపై తీవ్రఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. ఈ సంఘటన సామర్లకోట పోలీస్‌స్టేషన్‌కు కేవలం 6 కిలోమీటర్ల దూరంలోనే ఉండడమేగాక ఈ రెండు కుటుంబాల మధ్య మూడునెలలుగా జరుగుతున్న వివాదం తొలుత వేట్లపాలెం సచివాలయ మహిళా పోలీసు నుంచి పంచాయతీ అధికారులకు, సామర్లకోట పోలీసు అధికారులకు తెలిసిందే. అయినా ఆదివారం రాత్రి జరిగిన కత్తులతో దాడులు ఘటనను పోలీసులు ముందుగా పసిగట్టలేకపోవడంతో వారి వైఫల్యంగానే పలువురు పేర్కొంటున్నారు.

సామర్లకోట మండలం వేట్లపాలెంలో ఇంటి స్థలం విషయమై ఒకే సామాజికవర్గానికి చెందిన రెండు కుటుంబాల మధ్య ఆదివారం జరిగిన కత్తులతో దాడికి దిగిన సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన విషయం విధితమే. పంచాయతీ అధికారులు సదరు అక్రమ నిర్మాణదారుడికి నోటీసులు సైతం ఇచ్చిన విషయం పోలీసులకు ముందే తెలిసినా పోలీసులకు, ఇంటిలిజెన్స్ వర్గాలకు ఏమాత్రం తెలియని రీతిలో పక్కా వ్యూహాన్ని పన్ని తమ దాడులతో ప్రత్యర్థి వర్గంలో ముగ్గురి హత్యకు కారణమయ్యారు. ఈ సంఘటనలో మరో ఏడుగురు తీవ్రంగా గాయపడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇంటి శ్లాబ్ నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఉన్న కార్దాల కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఏమాత్రం ఊహించలేకపోవడం వల్లే కత్తిపోట్లకు గురైనట్లు తెలిసింది. ఈ హఠాత్పరిణామం నుంచి తేరుకునే లోపునే కార్దాల కుటుంబాలకు చెందిన ఒకరు మృతి మరో 9మంది వ్యక్తులు రక్తపుమడుగులో ఉన్నారు. సంఘటనా స్థలిలో హాహాకారాలు మిన్నంటడంతో దాడులకు పాల్పడిన వారు తిరిగి కత్తులతో పరారయ్యారు. సంఘటనకు దారి తీసిన వాస్తవ సమాచారాన్ని ఆదివారం రాత్రి కొంతమేర సేకరించిన జిల్లా పోలీసు ఉన్నతాధికారి సోమవారం మరింత సమాచారాన్ని సేకరించినట్లు పోలీసువర్గాల ద్వారా తెలిసింది. దీంతో ముమ్మాటికీ పోలీసుల వైఫల్యం ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిసింది.

మృతదేహాలకు పోస్ట్‌మార్టం పూర్తి

కాగా ఆదివారం హత్యకు గురైన ముగ్గురి మృతదేహాలకు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం ప్రక్రియ పూర్తిచేసి సోమవారం రాత్రి వేట్లపాలెంలోని కుటుంబసభ్యులకు అప్పగించడంతో మూడు మృతదేహాలకు వేట్లపాలెం శివారు ఆర్బీ కొత్తూరు వెళ్లే రోడ్డులో దళిత శ్మశానవాటికకు కాకినాడ నుంచి నేరుగా తరలించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సామర్లకోట పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు నిర్వహించారు. హత్యా సంఘటన జరిగి 24 గంటలు దాటుతున్నా పోలీసుల చర్యలు అత్యంత గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు దారితీస్తోంది.



హత్యల ఘటనలో దాడికి ఉపయోగించిన కత్తి

వెంకన్న ఆలయంపై ఆరోపణలు అర్థరహితం

- సోషల్ మీడియా పోస్టుపై పోలీసులకు ఫిర్యాదు: ఈవో

ఆత్రేయపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంపై ఓ వ్యక్తి సోషల్ మీడియా వేదికగా చేస్తున్న ఆరోపణలపై ఆలయ ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తీవ్రంగా ఖండిస్తూ ఆ ఆరోపణలు అర్థరహితమన్నారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈనెల 12న దేవదాయశాఖ పర్యవేక్షణాధికారుల సమక్షంలో 300మంది సిబ్బంది సేవకులు, అర్చకులు, గ్రామస్థులు, బ్యాంకు సిబ్బంది సమక్షంలో హుండీ కానుకలు లెక్కింపు నిర్వహించామన్నారు. పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు నిఘా నీడలో లెక్కింపు ప్రక్రియ ప్రతినెలా చేపడతామన్నారు. ఈ లెక్కింపులో రూ.5లక్షల నగదు గోల్‌మాల్ చేశారని ఓ పార్టీకి చెందిన వ్యక్తి సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టడంతో కలకలం చెలరేగింది. స్వామివారి ఆలయంపై తప్పుడు ప్రచారం నిర్వహిస్తూ స్వామి ప్రతిష్ఠతను అపఖ్యాతిపాలు చేస్తూ తప్పుడు ఆరోపణలు చేసిన సదరు వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన పెద్దలు హుండీ లెక్కింపు సీసీ పుటేజీని పరిశీలించారు. తప్పుడు ఆరోపణలు చేసిన వ్యక్తిపై కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ మేరకు ఈవో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

గోదావరి నదిలో మొసలి సంచారం

- లొల్లలో చూసిన స్థానికుడు
- భయాందోళనలో రైతులు

ఆత్రేయపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామంలోని గోదావరి నదీలో మొసలి సంచరిస్తుందని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గౌతమి గోదావరి నదీలో సోమవారం లొల్ల గ్రామానికి చెందిన దాట్ల సత్తిరాజు రైతు పశువులను గోదావరి వద్దకు తీసుకువెళ్లాడు. ఒడ్డుకు చేరుకున్న 9 అడుగుల మొసలని చూసి ఆ రైతు ఆందోళనకు గురయ్యాడు. ఆ రైతు శబ్ధం విని ఒడ్డును ఉన్న మొసలి నదీలోకి జారుకుంది. మొసలిని చూసిన రైతు విషయాన్ని పక్కనే ఉన్న రైతులకు వివరించాడు. నిత్యం పాడి రైతులు గోదావరి వద్దకు చేరుకుని పశువులను కడుగుతూ ఉంటారు. శ్మశానవాటిక ఇక్కడే ఉండడంతో మృతదేహాలను ఖననం చేసేందుకు వస్తూ ఉంటారు. దీనిపై రైతులు, ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు. గోదావరిలో స్నానం ఆచరించేవారు జాగ్రత్తగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.

'రేబిస్'తో వ్యక్తి మృతి

ఆత్రేయపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం కుమ్మరవీధికి చెందిన మానేపల్లి దుర్గాప్రసాద్(37) రేబిస్ వ్యాధితో మృతిచెందాడు. ఆయన ఆర్టీసీలో ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం ఇంటివద్ద ఉన్న ప్రసాద్‌ను కుక్క కరిచింది. ఈ మేరకు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అక్కడినుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

రాజోలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిమండలం అంతర్వేదికర రావి వారి గ్రూపునకు చెందిన తన చిన్నాన్న రావి వీరవెంకటనరసింహారావును ఆస్తికోసం కొట్టి చంపిన కేసులో రావి రాంబాబును మలికిపురం మండలం దిండి చెక్‌పోస్టు వద్ద రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ సోమవారం అరెస్టు చేశారు. ఈసందర్భంగా రాజోలు సర్కిల్ కార్యాలయంలో సీఐ నరేష్‌కుమార్ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ నిందితుడు రాంబాబు చిన్నాన్న వీరవెంకటనరసింహారావును కొట్టి చంపాడన్నారు. ఈ కేసును ఛేదించిన రాజోలు సీఐ రాజేష్‌కుమార్, సఖినేటిపల్లి ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, సిబ్బందిని ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ అభినందించారు.

రావులపాలెంలో వివాహిత ఆత్మహత్య



మామిడిశెట్టి శృతి(ఫైల్)

రావులపాలెం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం లక్ష్మీపోలవరానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిశెట్టి శృతి(25)కి ఐదేళ్ల క్రితం వెంకన్నబాబుతో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. 15వ తేదీ మృతురాలు భర్త పని నిమిత్తం సిద్ధాంతం వెళ్లి అదే రోజు సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి చూడగా శృతి బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని చనిపోయి ఉండడాన్ని గమనించాడు. ఈ విషయాన్ని మృతురాలు తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. తండ్రి కొప్పిశెట్టి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.చంటి తెలిపారు. శృతి ఎందుకు ఆత్మహత్య చేసుకుందనే కారణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో నుంచి జారిపడి డ్వాక్రా వీవోఏ మృతి



నారాయణమ్మ (ఫైల్)

తుని రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో డ్వాక్రా వీవోఏ మృతి చెందింది. కాకినాడ జిల్లా తుని మండలం డి.పోలవరం గ్రామానికి చెందిన నల్లల ఆదినారాయణమ్మ(23) డ్వాక్రా వీవోఏగా విధులు నిర్వర్తిస్తోంది. తుని కార్యాలయంలో పనులు ముగించుకుని ఆదివారం రాత్రి ఆటోలో ఇంటికి తిరిగి వెళ్తుండగా జారిపడి తీవ్ర గాయాలపాలైంది. ఆమెను 108 అంబులెన్సులో తొలుత తుని ఏరియా ఆస్పత్రికి, అక్కడినుంచి మెరుగైన వైద్యంకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి భర్తతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

కాకినాడ క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడలో సోమవారం ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఏఎస్ఆర్ జిల్లా రాజవొమ్మంగికి చెందిన 36ఏళ్ల ఎలుసూరి కనకరాజ్‌కుమార్ కాకినాడ మెయిన్‌రోడ్డులోని బజాజ్ ఫైనాన్స్ సంస్థలో రికవరీ ఏజెంట్ గా పని చేస్తున్నాడు. కాగా జగన్నాథపురానికి చెందిన 25ఏళ్ల లంకె శ్రీనివాస్ చాలా కాలంగా కనకరాజ్‌కుమార్‌కి స్నేహితుడు. ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలు ఉండడం తో కొంతకాలంగా మనస్పర్థలు ఏర్పడ్డా యి. ఈక్రమంలో ఆదివారం రాత్రి వారి మధ్య ఏర్పడ్డ ఘర్షణ కారణంగా సోమవారం సంస్థలో విధుల్లో ఉన్న కనకరాజ్‌కుమార్‌ను తన కూడా తెచ్చుకున్న కత్తితో శ్రీనివాస్ ఒక్క వేటువేశాడు. తప్పించుకునే క్రమంలో కనకరాజ్‌కుమార్ తలకుబలమైన గాయమైంది. శ్రీనివాస్ అక్కడినుంచి పరారయ్యాడు. కాకినాడ టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఆగిందని పట్టాలు దాటబోయి..

మరో రైలు ఢీకొని యువకుడి మృతి



అనపర్తి రైల్వేస్టేషన్‌లో రైలు ఢీకొని మృతి చెందిన పవన్

అనపర్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మూసి ఉన్న రైల్వే గేటు వద్ద పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తుండగా మరో రైలు ఢీకొని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి బాబానగర్‌కు చెందిన కులంపర్తి పవన్(25) ఒక హోటల్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం హోటల్ పనికి వెళుతూ బాలుర ఉన్నత పాఠశాల వద్ద మూసి ఉన్న రైల్వే గేటు వద్ద పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తున్నాడు. అప్పటికే గూడ్సు ట్రైన్ ఆగి ఉండడంతో ఆ ట్రైన్ ముందుకు వెళుతుందేమోనన్న మీమాంసతో గూడ్సు బండిని దాటుతుండగా మరో ట్రాక్ పైనుంచి విశాఖ వైపుగా వెళుతున్న మరో గూడ్సు రైలు పవన్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని సామర్లకోట రైల్వే పోలీసులకు సమాచారం అందించినట్టు రైల్వే సిబ్బంది తెలిపారు.

ఉపాధి..ఊపిరి తీసింది!

- ట్రాక్టరు తిరగబడి యువకుడి మృతి
- తూర్పుగోదావరి జిల్లా పెద్దేవంలో ఘటన



ట్రాక్టరు తిరగబడి చనిపోయిన దుంపల రాజు

తాళ్లపూడి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి ఊపిరి తీసింది. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన దుంపల రాజు (33) పెద్దేవం శివారులో ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. అతడికి భార్య, నెలల వయసు గల బాబు ఉన్నారు. ఇటుకలు తయారు చేయడానికి సోమవారం ఉదయం అడుసు మట్టిని ట్రాక్టరుతో తొక్కిస్తుండగా అకస్మాత్తుగా ట్రాక్టరు తిరగబడి అతను మట్టిలో కూరుకుపోయి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు తరలించామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రాజమహేంద్రవరం మహిళ..

హైదరాబాద్‌లో అనుమానాస్పద మృతి



మృతురాలు అన్సర్ జహాన్ (ఫైల్ ఫొటో)

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బీటెక్ చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్న రాజమహేంద్రవరానికి చెందిన ఒక మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటన ఈనెల 12న తెలంగాణ రాష్ట్రం నాంపల్లిలో జరిగింది. మృతురాలు తండ్రి ఫయాజ్ కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోరక్షణపేటకు చెందిన టీడీపీ నాయకురాలు సయ్యద్ అన్సరీ, ఫయాజ్ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె అన్సర్ జహాన్(30) బీటెక్ చదువుకుంది. ఆమెకు వివాహమై ఏడేళ్ల పాప ఉంది. భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి విడాకులు తీసుకున్నారు. అటుపై జహాన్ హైదరాబాద్‌లో చైతన్య విద్యాసంస్థలో రెండేళ్లుగా పనిచేస్తోంది. ఈ క్రమంలో అక్కడే పనిచేసే నాంపల్లికి చెందిన ఆలీ హుస్సేన్ అనే వ్యక్తి ఒక ప్రాజెక్టు వర్కు ఉందని చెప్పాడు. దానికి తాను రూ.5లక్షలు పెడతానని, నువ్వు రూ.5లక్షలు పెట్టాలని, దాన్ని పూర్తి చేస్తే రూ.1.50 కోట్లు వస్తాయని చెప్పాడు. దీంతో ఆమె రూ.5లక్షలు పెట్టుబడి పెట్టింది. ఆలీ హుస్సేన్ నాంపల్లిలో ఆఫీసును ప్రారంభించాడు. ఈ నెలలో పని పూర్తయ్యింది. దీంతో తనకు రావాల్సిన రూ.50 లక్షలు ఇవ్వాలని జహాన్ ఒత్తిడి చేసింది. ఈ నేపథ్యంలో ఈనెల 12వతేదీ సాయంత్రం నాంపల్లిలో ఆఫీస్‌లో జహాన్‌పై హుస్సేన్ రాడ్‌తో కొట్టి చంపేశాడని, ఆపై చున్నీతో ఉరివేసుకున్నట్టు సృష్టించాడని మృతురాలి తండ్రి ఫయాజ్ ఆరోపించాడు. తాను శుక్రవారం తన కుమార్తెకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదని, దీంతో అనుమానం వచ్చి ఆమె ఆఫీస్‌కు ఫోన్ చేసినా స్పందన లేకపోయిందని తెలిపారు. ఆలీ హుస్సేన్ విజిటింగ్ కార్డు గతంలో తన కుమార్తె ఇవ్వడంతో అతడికి ఫోన్ చేస్తే అతని తల్లి లిఫ్ట్ చేసి జహాన్ ఉరివేసుకుందని చెప్పారని, దీంతో తాను తన భార్య కలిసి హైదరాబాద్ వెళ్తే జరిగిన విషయం తెలిసిందని చెప్పారు. హత్య చేసిన ఆలీ హుస్సేన్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు. సోమవారం అన్సర్ జహాన్ మృతదేహాన్ని రాజమహేంద్రవరం తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ నివాళులర్పించారు. నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ప్రాజెక్టులు ఇప్పిస్తానని

రూ.57.75 లక్షల టోకరా

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాజెక్టులు ఇప్పిస్తానని ముగ్గురు తన వద్ద నుంచి రూ.57లక్షల75వేలు తీసుకుని మోసం చేశారని బొమ్మూరు వెంకటగార్డెన్స్‌కు చెందిన చింతకాయల సోమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం.. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన సోమేష్ ఎల్‌అండ్‌టీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతను ప్రస్తుతం బొమ్మూరులో నివాసం ఉంటున్నాడు. అతనికి పరిచయమైన ఆకుల సౌజన్య, ఆకుల శ్రీనివాస్, అజ్జరపు సునీల్ ప్రభుత్వం పాజెక్టులు ఇప్పిస్తామని నమ్మించి దఫదఫాలుగా వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయించుకుని ప్రాజెక్టులు మంజూరైనట్టు లెటర్లు సోమేష్‌కు ఇచ్చారని సోమేష్ ఆరోపిస్తున్నాడు. ఆ లెటర్లు ఫేక్ అని తెలియడంతో తాను డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే వారి నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో తనకు న్యాయం చేయాలని బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

అభ్యసనా సామర్థ్యాలు పెంచాలి

జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి



మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి

గోకవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): శిక్షలో నేర్చుకున్న అంశాలను పాఠశాల్లో నూరు శాతం అమలయ్యేలా చూడాలని జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి అన్నారు. రాజానగరం మండలం మల్లంపూడిలోని సాయి మాధవి ఇంజనీరింగ్ కళాశాలలో పాఠశాల నాయకత్వ అభివృద్ధి శిక్షణా కార్యక్రమం రెండో స్పెషల్ 6వ బ్యాచ్ ను ఎస్.సుభాషిణి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యసన సామర్థ్యాలు మెరుగు పర్చేందుకు ఉపాధ్యాయులతో కలిసి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎస్ఎస్ఈఆర్టీ విడుదల చేసిన 10వ తరగతి యాక్షన్ ప్లాన్ ను అమలు చేస్తూ ఈ విద్యాసంవత్సరం నుంచే పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ డమిక్ మానిటరింగ్ అధికారి గౌరీశంకర రావు, కాకినాడ ఏఎంవో రామారెడ్డి, మండల విద్యా శాఖాధికారులు పాల్గొన్నారు.

వంద అడుగుల రోడ్డు.. రెండడుగులే మిగిలింది

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ ప్రకారం వంద అడుగులు ఉన్న రోడ్డు ఇప్పుడు కేవలం రెండు అడుగులు మాత్రమే మిగిలిందని మాజీ కార్పొరేటర్ బర్రే కొండబాబు సోమవారం కమిషనర్ కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదు చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి కమిషనర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రాజమహేంద్రవరం క్వారీ ప్రాంతంలో కాటేరియం ఎదురుగా ఉన్న రహదారి లోపలకు వెళితే రోడ్డు కనిపిస్తోందన్నారు. క్వారీ గోతుల కారణంగా ఇప్పటికే చాలా మంది వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారని ఈ ప్రాంతంలో దృష్టి పెట్టాలని కోరారు. ఇప్పుడు తాజాగా రోడ్డు కూడా క్వారీగోతుల్లోకి దిగిపోయి కేవలం రెండు అడుగులు రహదారి మాత్రమే ఉండడంతో ఆ ప్రాంతం చాలా ప్రమాదకరంగా మారిందన్నారు. తక్షణమే క్వారీ గోతులు పూడ్చిందాలని కోరారు. నగర పరిధిలో వివిధ సమస్యలపై ప్రజలు కమిషనర్‌కు మొత్తం ఐదు అర్జీలు అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ ఎస్.వెంకటరమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య పాల్గొన్నారు.



కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందిస్తున్న బర్రే కొండబాబు

ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల సంఘం

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా షణ్ముఖరావు ఎన్నిక

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల సంఘం ఎన్నికల్లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వాణిజ్యశాస్త్ర అధ్యాపకుడు పి.షణ్ముఖరావు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇదే కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకుడిగా పనిచేస్తోన్న బి.మల్లికార్జున జోన్ - 2 సెక్రటరీగా ఎన్నికయ్యారు.



పి.షణ్ముఖరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు



బి.మల్లికార్జున జోన్ - 2 కార్యదర్శి

రామకృష్ణ మిషన్ సేవలకు రెండు పురస్కారాలు

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణ మిషన్ దేశవ్యాప్త సేవలకు గుర్తింపుగా పశ్చిమ బెంగాల్ రాష్ట్ర గవర్నర్ ప్రతిభా పురస్కారం, ఆరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం నుంచి స్టేట్ అవార్డు లభించినట్లు రామకృష్ణ మఠం మిషన్ ప్రధాన కార్యదర్శి స్వామి సువీరానందజీ మహరాజ్ పేర్కొన్నారు. 115వ వార్షిక సర్వసభ్య సమావేశంలో సమర్పించిన నివేదిక వివరాలను రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి శ్రీ వినిజ్ఞయానందజీ మహరాజ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోని 235 రామకృష్ణ మఠం, మిషన్ కేంద్రాల ద్వారా వివిధ సేవా కార్యక్రమాలకు కోట్లాది మంది లబ్ధిదారుల కోసం 1292 కోట్ల రూపాయలు వెచ్చించినట్లు పేర్కొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకే విముక్తి దళం

అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించేందుకు కార్మిక, పోలీస్ శాఖలు కలిపి ప్రత్యేక విముక్తి దళంగా ఏర్పాటు చేసినట్లు అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు టాస్క్ ఫోర్సు విముక్తి దళ బృందం ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో సోమవారం అడిషనల్ ఎస్పీ జెండా ఊపి బృందానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. టాస్క్‌ఫోర్సు ఈ రోజు నుంచి జిల్లాలో బాలకార్మికుల నిర్మూలనకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, కార్మిక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విముక్తి దళానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్న అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ

విద్యుత్ బిల్లుల దహనం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ విమర్శించారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ సర్దుబాటు ఛార్జీలకు నిరసనగా రాజమహేంద్రవరం శ్యామలా సెంటర్‌లో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక రూ.11 వేల కోట్లు సర్దుబాటు ఛార్జీల పేరుతో భారం మోపడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తులసి, ఎన్.రాజా, రాజమహేంద్రవరం నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.పవన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

దుర్గాదేవి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

కడియం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వీరవరం దుర్గాదేవి 40వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో నాలుగు రోజులపాటు జరిగే దుర్గాదేవి ఉత్సవాలకి ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం నుంచి 22వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఉత్సవం జరగనుంది. ఆలయం వద్ద విద్యుత్ అలంకరణ చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా ఈ ఉత్సవానికి గ్రామానికి చెందిన ఆడపడుచులు రావడం ఆనవాయితీ. ఉత్సవం సందర్భంగా సీఐ ఏ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

అఖిలపక్ష సమావేశానికి అనుమతి కోరుతూ

అస్సాగో బాధితుల వినతి

గోకవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అఖిలపక్ష సమావేశానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ గుమ్మళ్లదొడ్డి అస్సాగో బాధితులు సోమవారం గోకవరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అస్సాగో ప్యాక్టరీ విషయంలో తమ సమస్యల పరిష్కారం కోరుతూ 28న గ్రామంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించే దుకు బాధితులు సమాయత్తమవుతున్న తరుణంలో అనుమతి కోరుతున్నామన్నారు. దీనిలో భాగంగా తమ సమస్యల శాశ్వత పరిష్కారం అమలు చేయాలంటూ తహశీల్దార్ ఎదురుగా నల్లజెండాలు ప్రదర్శించారు. కలెక్టర్‌కు కూడా వినతిపత్రం అందిస్తామని గ్రామస్తులు తెలిపారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

శివయ్యకు అన్నాభిషేకం

రాజానగరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శివ ముక్కోటిని పురస్కరించుకుని రాజానగరం శివాలయంలో సోమవారం సామూహిక రుద్రాభిషేకాలు జరిపారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు కోయిలమూడి శ్రీనివాసరావు దేశాల మీదుగా పలువురు భక్తులు కొరాడల నరసింహారావు దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారికి అన్నాభిషేకం క్రతువును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదే విధంగా కొత్త సుబ్బారావు కౌశిక్ దంపతులచే అన్నదానం జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని, అన్న ప్రసాదంలో పాల్గొన్నారు.

రైతు సమస్యలు సకాలంలో పరిష్కరించాలి





రాజానగరం: కానవరం సదస్సులో అర్జీలను పరిశీలిస్తున్న జేసీ, రాజమహేంద్రవరం అర్బన్: సదస్సులో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

• జేసీ చిన్నరాముడు
• పలు చోట్ల రెవెన్యూ సదస్సులు

రాజానగరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి స్వీకరిస్తున్న భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జేసీ చిన్నరాముడు అధికారులను ఆదేశించారు. కానవరం, వల్లకఠీయం గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా కానవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు జేసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సదస్సుల్లో రైతులు భూ సమస్యలు పరిష్కారానికి ఇచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జేసీ తహశీల్దార్ లక్ష్మీరావణాన్ని ప్రశ్నించగా, పొలాలకు వెళ్లే సమయం కావడం వల్ల హాజరు కాలేదని బదులిచ్చారు. రెవెన్యూ సదస్సులో రీసర్వేకు సంబంధించి 6అర్జీలను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ శాంతి, వీఆర్వో ఆర్‌.గంగేశ్వరరావు, కూటమి నాయకులు సంగిత సత్తి బాబు, సంగెపు సతీష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కారానికే సదస్సులు

బిక్కవోలు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): భూసమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని నియోజకవర్గ రెవెన్యూ సదస్సుల ప్రత్యేకాధికారి ఎం.మాధురి తెలిపారు. రంగాపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ముగ్గురు రైతులు తమ సమస్యలు వివరించగా రెండింటిని ఆమె అక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్ సత్యశ్రీకు సూచించారు. రైతులందరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ కేలా ఏసురత్నం, కూటమి నేతలు నడింపల్లి చిరంజీవిరాజు, కొవ్వూరి అప్పలస్వామి, చెల్లే జోష్ బాబు, బిక్కవోలు ప్రాధమిక సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మండల సర్వేయర్ రవికుమార్, ఆర్ఐ కుమారి, వీఆర్వోలు సుబ్బారావు పాల్గొన్నారు.

సదస్సులను వినియోగించుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్ డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రూరల్ తహశీల్దార్ పి.వి.జె.ఎస్.కుమార్ అన్నారు. సదస్సుల్లో వచ్చిన ప్రతి అర్జీ నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. సోమవారం ధవళేశ్వరంలో నిర్వహించిన కార్యక్రమంలో 12 అర్జీలు వచ్చాయన్నారు. వీటిలో పట్టాదారు పాసుపుస్తకాల కొరకు 2, మ్యూటేషన్ కొరకు 5, 22ఏ 3, ఎన్‌క్రోచ్‌మెంట్లు ఒక దరఖాస్తు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి వేదవల్లి, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ భువనేశ్వరరావు, వీఆర్వో రవి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే మీ భూమి- మీ హక్కు

సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని భూసమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం మీ భూమి-మీ హక్కు పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం అర్బన్ తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన 45రోజుల్లోనే వాటిని పరిష్కరించడానికి రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. తహశీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. అర్బన్ తహశీల్దార్ వి.హెచ్‌జీకర్ పాపారావు, రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, సర్వేయర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సోమేశ్వరునికి విశేష పూజలు

నిడదవోలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులో బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శివుడికి ఇష్టమైన రోజు కావడంతో స్వామికి విశేష పూజలు అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో వేద పండితులు విశేష అభిషేకాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆర్చరీలో బంగారు పతకం

రాజమహేంద్రవరం కల్చరల్ డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి తేలం అజయ్ బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ డి.వీరమణమూర్తి తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్ ఆర్చరీ (విలు విద్య) టోర్నమెంట్‌లో 30 మీటర్ల విభాగంలో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయిలో 50మీటర్ల పోటీకి అర్హత సాధించినట్లుగా పేర్కొన్నారు. విద్యార్థిని స్పోర్ట్స్ విభాగ అధిపతి పీఏ కిశోర్ బాబు, జి.శరత్‌బాబు,పీఈటీ సంజీవరావు, కె.విశ్వేశ్వరరావు తదితరులు అభినందించారు.

రేపు మైనార్టీ హక్కుల పరిరక్షణ దినోత్సవం

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గీతా అప్సర థియేటర్ పక్కన ఉన్న దర్గా షాదీఖానాలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సునీల్ కుమార్ మెలిమి ఆధ్వర్యంలో బుధవారం మైనార్టీ హక్కుల పరిరక్షణ దినోత్సవ కార్యక్రమం జరుగుతుందని మైనార్టీ సంక్షేమ శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈకార్యక్రమానికి డీఎల్ ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. మైనార్టీ నాయకులు, ప్రజలు విచ్చేసి తమ హక్కుల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు.

ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్

కడియం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు 34 షెడ్యూల్ తెగల వారు ఉన్నారని, వారందరి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం కడియం మండలం వేమగిరి పంచాయతీ కార్యాలయం వద్ద జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెవిఎన్ జ్యోతి, ఎంపీడీవో కె.రమేష్, మండల స్థాయి అధికారులతో కలిసి ఎస్టీ కుల పెద్దలతో సమావేశం నిర్వహించారు. ముందుగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వడిత్య శంకర్‌నాయక్ మాట్లాడుతూ పెద్దల తెగల ప్రజల సమస్యలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, వివాహ వయస్సు నిండిన వారికే వివాహాలు చేయాలని, అపుడే వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వ హక్కు కలిగి ఉండాలంటే వాటిపై అవగాహన అవసరం అన్నారు. ప్రభుత్వం విద్యకు ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని, పిల్లలను 20ఏళ్ల వరకు చదివించాలని అపుడే వారికి సమాజంలో గౌరవంగా జీవించే గలుగుతారన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం అధికార యంత్రాంగం ఉందన్నారు.



కడియం: ఎస్టీ కమిషన్ సభ్యులకు సమస్యలు వివరిస్తున్న మహిళ

● ఇళ్ల స్థలాల మంజూరు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేయించాలని, రోడ్లపై మురుగు నీరు ప్రవాహంతో దోమలు వ్యాప్తి చెంది రోగాలు బారిన పడుతున్నామని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, కడియపులంక, వేమగిరి సెంటర్లలో ఎరుకలవృత్తి విగ్రహాల ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్‌కు అర్జీలు అందించారు. కడియపులంకలో నిర్మించిన కమ్యూనిటీ హాలుకు విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించాలని కోరారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఉపాధి కొరకు బ్యాంకు రుణాలు ఇప్పించాలని కోరారు. అలానే వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందించారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బొమ్మూరు ఆశ్రమ పాఠశాల నిర్వహణ విషయంలో ప్రధానోపాధ్యాయులు, వసతిగృహం వార్డెన్ నిర్వహణా వ్యవస్థ మరింత మెరుగుపరుచుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ సృష్టం చేశారు. సోమవారం బొమ్మూరులోని ఏపీటీడబ్ల్యూ పాఠశాలను సందర్శించి విద్యార్థినీ విద్యార్థులతో సంభాషించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంటసాల సక్రమ నిర్వహణ లేకపోవడం గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల క్షేమం కోసం నిర్వహిస్తున్న హాస్టళ్లను, గురుకుల పాఠశాలల్లో మెరుగైన నాణ్యత కలిగిన పరిశుభ్రమైన ఆహారం అందించాలని అధికారులను ఆదేశించారు. తరగతి గదులలో పాఠశాల అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ కారణమన్నారు. పాఠశాలలో కూరగాయలు ఇష్టానుసారంగా ఉండటంతో హెచ్ఎంను ప్రశ్నించారు. వార్డెన్ బాధ్యతలపై శంకర్‌నాయక్ ప్రశ్నించారు. పనితీరు మెరుగుపర్చుకోవాలన్నారు. గిరిజన సంక్షేమాధికారి కెవిఎన్‌జ్యోతి, హెచ్ఎం ఎంప్రియదర్శి, డిప్యూటీ వార్డెన్ వెంకటలక్ష్మి ఉన్నారు.

నేడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు

అనపర్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో భాగంగా మంగళవారం సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. అనపర్తి డిస్ట్రిబ్యూటరీ కమిటీకి సంబంధించి మంగళవారం అనపర్తి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో డీసీ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనపర్తి డీసీ పరిధిలో అనపర్తి, బలభద్రపురం, బిక్కవోలు, జి.మేడపాడు, కడియం నీటి సంఘాల అధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌ను ఎన్నుకుంటారని ఆయన తెలిపారు.

రెండు రోజులపాటు ఆర్‌జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ

అనపర్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళిక 2025 26కు సంబంధించి రెండు రోజులపాటు అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎమ్.రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళ, బుధవారాల్లో మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిక్షణకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నిర్ణీత అభివృద్ధి లక్ష్యాల చేరుకోవడం అంశాలపై శిక్షణ అందిస్తారని ఎంపీడీవో తెలిపారు.

బీమా సొమ్ము అందజేత

గోకవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జీవిత ప్రమాదవశాత్తు మరణించిన వేణుగోపాల పీఏసీఎస్ కామరాజుపేట సభ్యుడు ఎస్.శ్రీరామ్మూర్తి కుటుంబానికి సోమవారం రూ.2 లక్షల బీమా సొమ్మును కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గోకవరం డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ఈ.మల్లిఖార్జున, పీఏసీఎస్ చైర్మన్ మల్లాల కృష్ణ మోహన్ చేతుల మీదుగా మృతుడి భార్య దిన లక్ష్మికి అందించారు. కార్యక్రమంలో సంఘ సీఈవో కె.వీర భద్రరావు, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ యాసిన్, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నేడు దుర్గమ్మ తీర్థం

కోరుకొండ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది మార్గశిర మాసంలో పౌర్ణమి తర్వాత 3వ రోజున దుర్గమ్మ తీర్థం నిర్వహించడం ఇక్కడ సంప్రదాయం. కోరుకొండ మండలంలో నర్సాపురం, మధురపూడి, గాదాల, శ్రీరంగపట్నం, కణుపూరు గ్రామాల్లో దుర్గమ్మ జాతర పేరిట ఐదురోజు ఉత్సవాలను మంగళవారం నిర్వహించనికి ఏర్పాట్లు చేశారు. రైతులు ఎక్కువగా ఉండే కోరుకొండ పరిసర ప్రాంతంలో దుర్గమ్మ జాతరకు ప్రాముఖ్యత ఉంది. దాన్యం ఇంటికి వచ్చే ఈ సమయంలో ముందుగా దుర్గాదేవికి నైవేద్యాలు సమర్పించి జాతర నిర్వహిస్తారు. ఈ జాతరలో మూరి దుర్గమ్మ జాతరకు విశిష్టస్థానం ఉంది. కోరుకొండ, జగ్గంపేట, రాజానగరం, రంగంపేట, గండేపల్లి మండలాల ప్రజలు జాతరలో పాల్గొంటారు.





కోరుకొండలో ధనుర్మాస ప్రారంభం సందర్భంగా వేంకటేశ్వరస్వామికి అర్చన చేస్తున్న దృశ్యం, పక్క చిత్రంలో బిక్కవోలు మండలం కొమరిపాలెంలో నగర సంకీర్తన చేస్తున్న గ్రామస్తులు

వైభవంగా ప్రారంభమైన ధనుర్మాసం

• ఆలయాల్లో తిరుప్పావై సేవా కాలం • మోగిన నెలగంట

కోరుకొండ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాలను సోమవారం ఉదయం కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆనువంశిక ధర్మకర్త, దేవస్థానం చైర్మన్ పరాసరంగరాజభట్టర్ స్వామి ప్రారంభించారు. కోరుకొండ ఆర్‌సీ బస్టాండ్ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయం, ఆధ్యాత్మిక కోదండ రామాలయం, వెస్ట్ మగేనగూడెం గీతామిషన్ వద్ద ధనుర్మాస ఉత్సవాలను అర్చకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అర్చనలు జరిపారు. గోదాదేవి శ్రీరంగనాథుడిపై రచించిన 30 పాశురాలను (పాటలు) తిరుప్పావై సేవాకాలం పేరిట ధనుర్మాసం 30 రోజులు పారాయణం చేస్తారు. ధనుర్మాసం ప్రారంభం కావడంతో సంక్రాంతి నెలగంట మోగింది. సోమవారం సాయంత్రం నుంచి సంక్రాంతి ముగ్గుల ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకస్వాములు, భక్తులు, తిరుప్పావై సేవాకాలం సభ్యులు పాల్గొన్నారు.

నగర సంకీర్తన

బిక్కవోలు: ధనుర్మాస ప్రారంభం సందర్భంగా సోమవారం తెల్లవారుజామున కొమరిపాలెంలో నగర సంకీర్తన ప్రారంభించారు. మాజీ ఉపసర్పంచ్ ద్వారంపూడి వెంకటరెడ్డి శ్రీవేణుగోపాలస్వామి పాదుకలు తలపై పెట్టుకుని గ్రామ సంకీర్తన చేపట్టారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ గ్రామ సంకీర్తనను భోగి వరకు ప్రతి రోజూ నిర్వహిస్తామన్నారు. ఈయన వెంట గ్రామస్తులు సత్తి రామయ్య, వెంకటరెడ్డి మాస్టర్, కర్రి ప్రసాదరెడ్డి, ముద్దురెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు మోటారుసైకిళ్లు ఇచ్చిన వారూ నేరస్తులే

ద్విచక్ర వాహన తనిఖీలో సీఐ సుమంత్

అనపర్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మైనర్లకు మోటారు సైకిళ్లు ఇచ్చిన వారూ నేరస్తులేనని అనపర్తి సీఐ సుమంత్ అన్నారు. సోమవారం దేవీచౌక్ వద్ద పోలీసులతో కలిసి వాహన తనిఖీ చేశారు. మోటారు సైకిళ్లు నడుపుతున్న పలువురు మైనర్ల నుంచి వాహనాలు స్వాధీనం చేసుకుని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. సీఐ మాట్లాడుతూ జీవిత మైనర్లు అధిక సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో రోడ్లపైకి వస్తున్నారని సరైన శిక్షణ లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు.



దేవీచౌక్ వద్ద ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ సుమంత్

కూచిపూడి కళాకారిణి హేమాక్షికి మంత్రి దుర్గేష్ అభినందన

కడియం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): దుళ్ల గ్రామానికి చెందిన కూచిపూడి కళాకారిణి, నృత్య మయూఖ పురస్కార గ్రహీత దూడల హేమాక్షిని మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. రాజమహేంద్రవరంలో సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకకు మంత్రి హాజరయ్యారు. కూచిపూడి నృత్యంతో స్వాగతం పలికిన హేమాక్షి నృత్యాన్ని ఆయన మెచ్చుకున్నారు. తన నాలుగో ఏటనే తిరుపతిలో కూచిపూడి నాట్యంతో అరంగేట్రం చేసిన హేమాక్షి షణ్ముఖ్యాలతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇచ్చింది. కార్యక్రమంలో సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ అధిమూలం సాయిబాబా తదితరులు ఉన్నారు.



హేమాక్షిని అభినందిస్తున్న మంత్రి దుర్గేష్

నేటి నుంచి పాలిటెక్నిక్ కాలేజీలో

రీజనల్ స్పోర్ట్స్ మీట్

రాజమహేంద్రవరం రూరల్ డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో గల డాక్టర్ బీఆర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళ, బుధవారాల్లో రీజనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ పోటీల్లో తూర్పు గోదావరి జిల్లాలో గల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. దీనికి జి.గణేష్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌తోపాటు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరవుతారన్నారు.

అణుశక్తి రంగంలో ఉపాధి అవకాశాలు మెండు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అణుశక్తి రంగంలో పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, మెరుగైన ఉపాధి అవకాశాలు దొరుకుతాయని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్త శ్రీరామమూర్తి అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని రసాయనశాస్త్ర విభాగంలో సోమవారం ఎమ్మెస్సీ విద్యార్థులకు గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రసాయనశాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, అధ్యాపకులు టి.నరసింహమూర్తి, బి.మల్లికార్జున, సురేష్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

ఆర్డీవో కృష్ణనాయక్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల అర్జీలను పరిశీలించి నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ అన్నారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ పై కోసం లో ప్రజల అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ కమిటీ ఎన్నిక

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నికైంది. మొత్తం 15 మందితో నూతన కమిటీ ఏర్పాటు కాగా, అధ్యక్ష కార్యదర్శులుగా జికెవిఖలాల్, కె.సురేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.హుస్సేన్, ఎస్.రాజా తదితరులు ఉన్నారు.

విద్యుత్ పొదుపుపై డ్రాయింగ్ పోటీలు

రాజానగరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా రాజానగరం విద్యుత్ సబ్‌స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈఈ పి.సన్యాసిరావు, ఈఈ శ్రీదేవిశర్మ, రాజానగరం ఏఈ వినీస్‌కుమార్, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు



ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, జేసీ చిన్నరాముడు

జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తాం

- రేడియాలజిస్ట్ నియామకానికి చర్యలు తీసుకుంటాం
- ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ప్రధాన సమస్యగా ఉన్న రేడియాలజిస్ట్ నియామకానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ బ్లాకులో సోమవారం నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి సంఘం (హెచ్‌డీఎస్) తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్, అల్ట్రా సౌండ్, ఎక్స్‌రే రిపోర్టులు రోగులకు త్వరగా అందేలా చూస్తామని పేర్కొన్నారు. గతంలో ఐఎంఏ ద్వారా అందించిన యూరాలజిస్ట్, కార్డియాలజిస్ట్ తదితర సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను తిరిగి ప్రారంభిస్తామన్నారు.ఈ మేరకు మంగళవారం ఐఎంఏ ప్రతినిధులతో చర్చిస్తామన్నారు. అవసరమైతే గౌరవవేతనంతో రేడియాలజిస్ట్‌ను తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎంసీహెచ్ బ్లాకులో రెండు అదనపు ఫ్లోర్లు అందుబాటులోకి వచ్చినా అవసరమైన వైద్య పరికరాలు రాలేదని, అవి త్వరగా ఏర్పాటు చేసేలా సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్నామన్నారు. ఆసుపత్రిలో బయో వ్యర్థాలను కాలుస్తున్నారని వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామన్నారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆసుపత్రి విషయంలో జరిగిన నిర్లక్ష్యాన్ని సరిచేస్తున్నామన్నారు.తమకు పెరిగిన వేతనాలు ఇవ్వడంలేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి ట్రామాకేర్ ఉద్యోగులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఆర్ఎంవో ప్రణవ్, హెచ్‌డీఎస్ సభ్యులు, ఆసుపత్రిలోని అన్ని విభాగాల హెచ్‌వోడీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అజెండాలో 24 అంశాలపై చర్చ..

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ అజెండాలోని 24 అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో చర్చకు ఉంచారు. హెచ్‌డీఎస్ సభ్యులు ఆసుపత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, సమస్యలపై సూచనలు, సలహాలు అందించారు. ఎన్టీఆర్ వైద్యసేవ నిధుల నుంచి చెల్లించేలా గౌరవ వేతనం ప్రాతిపదికన సిటీ టెక్నీషియన్ సేవలను వినియోగించుకునేందుకు అనుమతించాలని, సీఎస్ఆర్ నిధులతో రెండు అంబులెన్స్‌లు, న్యూరో సర్జికల్ పరికరాలు సమకూర్చాలని కోరారు. కొన్నేళ్లుగా ఎంఆర్ఐకు చెందిన విద్యుత్ ఛార్జీల బిల్లుల భారం పడుతున్న విషయాన్ని సమావేశం దృష్టికి తెచ్చారు. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ల సేవలను వినియోగించుకుని వారికి హెచ్‌డీఎస్ నిధులను వెచ్చించాలని రాజమహేంద్రవరం కమిషనర్ చేసిన రిక్వెస్ట్‌పైనా చర్చించారు. ఆసుపత్రి లాండ్రీ విభాగానికి చెందిన వాషింగ్‌మెషీన్ పనిచేయకపోవడంపై చర్చించారు. పాత ఏసీల మెయింటెనెన్స్ కాంట్రాక్టు, వన్ స్టాప్ సెంటర్‌కు 300 చదరపు మీటర్ల స్థలం, పాత ఫ్రీజర్లకు మరమ్మతులు, ఎన్టీఆర్ వైద్యసేవ నిధులు లేదా హెచ్‌డీఎస్ నిధుల నుంచి ఆఫీసుకు అవసరమైన కంప్యూటర్లు, ఫర్నిచర్, ప్రింటర్లు కొనుగోలు, గోదావరి పుష్కరాలకు తీసుకోవాల్సిన వైద్యపరమైన చర్యలు వంటి అంశాలను చర్చించారు. వీటిలో కొన్నింటిని ఆమోదించగా, పరికరాలు కొనుగోళ్లు, ఇతర భారీ బడ్జెట్ అంశాలను జిల్లా ఉన్నతాధికారుల అనుమతితో నిర్ణయం తీసుకుందామని వాయిదావేశారు. ఇటీవల ఆసుపత్రిలో ఒక పసికందు మృతిచెందిన ఘటనపై విచారణ చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ స్పెషలాఫీసర్‌కు సూచించారు.కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్నరాముడు,స్పెషలాఫీసర్ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.



పోలవరం ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

పోలవరం పరుగు

- 2026కి పూర్తి కావాలని ఆదేశం
- షెడ్యూల్ ప్రకటించిన బాబు
- మూడు రోజులు రాక్ పరిశీలన
- సీఎంకు కట్టుదిట్టమైన భద్రత
- పోలవరం సిబ్బందికి అనుమతిలేదు
- పూలబొకేల నిరాకరణ
- సీఎం చెంత ఈఎన్‌సీ, సెక్రటరీ, సీఈ

రాజమహేంద్రవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఇక పరుగులు పెట్టనుంది. సీఎం నారా చంద్రబాబునాయుడు స్వయంగా ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించి పూర్తి చేయడానికి షెడ్యూల్ ప్రకటించారు. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు ప్రజల్లో కూడా ప్రాజెక్టు పూర్తవుతుందనే నమ్మకం ఏర్పడింది. సీఎం చంద్రబాబు స్వయంగా పనులు పరిశీలించడంతోపాటు అనేక విషయాలు ఆరా తీశారు. వ్యూపాయింట్ నుంచి స్పిల్‌వే, దానికి అవతల ప్రాజెక్టు కట్టబోయే ప్రాంతాన్ని పవర్ ప్రాజెక్టు పనులు పరిశీలించారు. తూర్పుగోదావరి వైపు జరుగుతున్న పవర్ ప్రాజెక్టును సీఎంకు ఈఎన్‌సీ చూపించడంతో అంతేనే ఇంకా ఎత్తు ఉంటుందా అని సీఎం అడగడంతో అంతేనని అధికారులు చెప్పారు. ఎగువ కాఫర్ డ్యామ్ నుంచి డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మించే ప్రాంతానికి చేరుకుని, అక్కడ జరుగుతున్న శాండ్ ఫిల్లింగ్, డయా ఫ్రంవాల్ నిర్మించే ప్రాంతంలో వైబ్రో కాంపాక్షన్, దిగువ కాఫర్ డ్యామ్ ప్రాంతం తిలకించారు. ప్రాజెక్టు మీద అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే సమయం గురించి అధికారుల సమీక్షలో చంద్రబాబు ఆరా తీశారు. 2027కి పూర్తి చేస్తామని అధికారులు చెప్పగా 2026 అక్టోబరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. ప్రాజెక్టు సివిల్ పనులు 2026 మేనెల, జూన్ నెలల నాటికి పూర్తి చేస్తే ఒక సీజన్ కోల్పోకుండా ఉండవచ్చన్నారు. 2026 నుంచి ప్రాజెక్టులో నీరు నిల్వ ఉండేలా చూడాలని చెప్పారు. మొదటి దశలో 41.15 కాంటూరు వరకూ రూ.12,157 కోట్లు ఖర్చుచేయగా అందులో రూ.2,345 కోట్లు కేంద్రం ఇచ్చిందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 7 లక్షల 27 వేల ఎకరాల ఆయకట్టు కొత్తగా సాగులోకి వస్తుందన్నారు. గత ఐదేళ్లలో నిర్వీర్యమైన ప్రాజెక్టుకు చంద్రబాబు రాకతో కళ వచ్చినట్టయింది.

నేటి నుంచి రాక్ పరీక్షలు

ప్రధాన డ్యామ్ ఎర్త్‌కమ్ రాక్ ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) నిర్మాణానికి చాలా రాక్ (రాయి) అవసరం ఉంటుందని, ఎక్కడెక్కడ ఏ రాయి ఉందో ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు చంద్రబాబుకు తెలిపారు.ఇక్కడ పనులకు అవసరమైన అనుమతులు పొందవలసిన అవసరం గురించి సమీక్షించారు. ముఖ్యంగా రాళ్ల నాణ్యతను పరిశీలించడానికి మంగళవారం ఒక నిపుణుల కమిటీ రానుంది. మూడు రోజులపాటు ఇక్కడే ఉండి, పలు రకాల రాళ్ల పరీక్ష చేస్తారు.

బాబు వచ్చారు..కళొచ్చింది..



సీఎం చంద్రబాబుకు ప్రాజెక్టు పనుల తీరును లాప్‌టాప్‌లో చూపిస్తున్న సిబ్బంది

భద్రత కట్టుదిట్టం..

సీఎం పర్యటన భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎవరినీ సీఎం చెంతకు వెళ్లనీయలేదు. కనీసం నాయకులను పూలబొకేలు ఇచ్చేందుకు అనుమతించలేదు. తప్పని పరిస్థితుల్లో నాయకులు ఒకటి రెండు పువ్వులను ఇచ్చి సీఎంకు స్వాగతం పలికారు. సుమారు 800 మంది పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. కనీసం ఇరిగేషన్ ప్రాజెక్టులో క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేస్తున్న అధికారులను సీఎం వద్దకు వెళ్లకుండా రాజమహేంద్రవరానికి చెందిన ఓ డీఎస్పీ అడ్డుకున్నారు. దీంతో ఇరిగేషన్ అధికారులు అసహనానికి గురయ్యారు. సీఎం వద్దకు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతోపాటు ఇరిగేషన్ సెక్రటరీ, ఈఎన్‌సీ, సీఈలను మాత్రమే అనుమతించారు. మ్యాప్ చూపినపుడు, ఫొటో ఎగ్జిబిషన్‌లో కూడా సీఎంకు ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు వివరించి చెప్పారు. కనీసం వినతులివ్వడానికి ప్రజలను సీఎం చెంతకు వెళ్లనీయ లేదు. అది గమనించిన సీఎం వెనక్కి వచ్చి వినతులు తీసుకున్నారు. ఇతర ప్రజాప్రతినిధులకు వచ్చే డౌట్లు తీర్చడానికి ప్రాజెక్టులో పనిచేసే అధికారులు అందుబాటులో లేక ఇబ్బందిగా మారింది.



చంద్రబాబుకు పువ్వులు ఇస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

4 గంటలు ఇక్కడే..

ఉదయం సుమారు 11.45 గంటలకు హెలికాప్టర్ దిగిన వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతంపలికారు. మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు గులాబీ పూలతోనూ, పసుపురంగు పూలతోనూ స్వాగతం పలికారు. సుమారు 4 గంటలపాటు ప్రాజెక్టు ప్రాంతమంతా కలియతిరిగారు. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, పితాని సత్యనారాయణ, మద్దిపాటి వెంకట్రాజు, బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, కలెక్టర్లు పి.ప్రశాంతి, వెట్రి సెల్వి, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



చంద్రబాబుకు పువ్వులు ఇస్తున్న బీవీఆర్ చౌదరి

ఉచిత ఇసుక పాలసీపై నిఘా పెట్టండి

పీజీఆర్ఎస్‌లో బీజేపీ వినతి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను నిర్దిష్ట కాల వ్యవధిలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక మీ కోసం కార్యక్రమంలో 119 అర్జీలను అధికారులు స్వీకరించారు. వివిధ మండలాల నుంచి ప్రజలు ఫిర్యాదుదారులు తరలివచ్చారు. ఆన్‌లైన్‌లో 118 అర్జీలు, ఆఫ్‌లైన్‌లో ఒక అర్జీ స్వీకరించామన్నారు. ఉచిత ఇసుక పాలసీకి తూట్లు పడుతుందని తక్షణమే నిఘా పెట్టి అక్రమాలను అదుపు చేయాలని బీజేపీ నేతలు రొంగల గోపి శ్రీనివాస్ , యానపు యేసు, ఎన్‌వీబీఎస్ ఆచారి, బోగవల్లి రామారావు, పన్నాల వెంకటలక్ష్మి, జగన్నాథరావు డీఆర్‌వోను కలిసి వినతి పత్రం ఇచ్చారు.



సమస్య వింటున్న అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ

36 ఫిర్యాదుల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం.మురళీకృష్ణ స్వీకరించారు.జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులు స్వీకరించారు.ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు.వాటి పరిష్కారానికి వెనువెంటనే నేరుగా సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మొత్తం 36 ఫిర్యాదులను ప్రజల నుంచి స్వీకరించారు.

ఉపాధి.. ఊపిరితీసింది
ప్రమాద.. మంచు!
వైసీపీలో ఖజానా ఖాళీ : మంత్రి దుర్గేష్
8

అధికారులు.. భూచోళ్లు!



- అక్రమార్కులకు సహకారం
- పేదల అసైన్డ్ భూములపై కన్ను
- తక్కువ ధరకు కొనుగోళ్లు
- తిరిగి ప్రభుత్వానికే విక్రయం
- కోట్లాది రూపాయల దోపిడీ
- నాటి ఐఏఎస్‌ల ప్రమేయం?
- ప్రభుత్వానికి ఫిర్యాదులు
- తూతూమంత్రంగా విచారణ
- తవ్వితే పెద్ద కుంభకోణమే
- అయినా నేటికీ తేలని వైనం

గత ఐదేళ్లూ..అక్రమ భూ బదలాయింపులు

గత ఐదేళ్లూ అక్రమాలకు అడ్డేలేదు.. ఉన్నతాధికారులు అప్పటి ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి ఇష్టానుసారం పనిచేశారు. నిబంధనలు అతిక్రమించి మరి సహకరించేశారు. వైసీపీ నాయకులకు ఆడింది ఆట.. పాడింది పాటగా మారిపోయింది.. భూముల కొనుగోలు వ్యవహారాల్లో ఎక్కడైనా ఉన్నతస్థాయి అధికారులు ఉంటారా.. అది తూర్పుగోదావరి జిల్లాలో జరిగింది.. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు పేదల నుంచి తక్కువకు కొనుగోలు చేసి మళ్లీ ప్రభుత్వానికే అమ్మేసిన ఉదంతం జరిగింది.. ఈ మేరకు ఫిర్యాదులు అందాయి. అయినా ఎందుకో మరి.. నేటికీ ఆ ఫైలు కదలడంలేదు.. అధికారులపై చర్యలూ కానరావడంలేదు. విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారు.

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్యాష్ కొట్టు..ఏ పనైనా జరిగిపోద్ది ఒట్టు..జగన్ పాలనలో అధికారులు ఇలా చేసి చూపించారు..అక్రమాలకు తెరలేపారు.అసైన్డ్ భూములతో ఒక ఆటాడుకున్నారు.తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం,రాజమహేంద్రవ రం రూరల్, రాజానగరం, గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి నియోజకవర్గాల పరిధిలో చాలా అక్రమాలకు అప్పటి అధికార యంత్రాంగం తెరలేపింది. అడ్డదారిలో ప్రభుత్వ భూములు కట్టబెట్టేశారు. అప్పటి ప్రజాప్రతినిధు లు, ఉన్నతాధికారులు కలిసి కోట్లాది రూపాయలు మింగేశారు.

గత ఐదేళ్లూ అసైన్డ్ భూమాయం

వైసీపీ ప్రభుత్వం గడచిన ఐదేళ్లలో జిల్లాలోని అసైన్డ్ భూములతో కోట్లాది రూపాయల వ్యాపారం చేసింది. ఇందుకు సహకరించిన అధికారులకు కోట్లాది రూపాయల ముడుపులు ముట్టజెప్పింది.అసైన్డ్ భూములు కలిగిన ఎస్సీ బీసీల నుంచి ఆయా భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని వేరొకరి పేరున రిజిస్ట్రేషన్ చేయించి అటుపై ఆయా భూములను ఇళ్ళ స్థలాలకు ప్రభుత్వానికి అమ్మి అందులో కోట్లాది రూపాయ లను అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు మూకుమ్మడిగా దోచేశారు. ఇందు కోసం హైదారాబాద్ పరిసర ప్రాంతాలకు చెందిన్ జగన్ బ్యాచ్‌ను వినియోగించారు. రాజానగరం మండలం కానవరం గ్రామంలో సర్వే నెం 235/2బీలో 6.76 ఎకరాల అసైన్డ్ భూమిని 2023 నవంబరు 22న అప్పటి ఉన్నతాధికారులు పేద ఎస్సీ రైతు నుంచి బినామీ వ్యక్తి పేరున ఎకరం రూ.30 లక్షలకు కొనుగోలు చేశారు. దీనికి సంబంధించి డాక్యుమెంట్లు నెంబరు 10779/ 2023, 10780/2023, 10919/2023గా ఎస్ఆర్‌వో రాజానగరం (427)గా రిజిస్టర్ చేశారు.ఈ ప్రక్రియ పూర్తయిన 20 రోజుల్లో ఇదే భూమిని ప్రభుత్వంతో ఎకరానికి రూ.64 లక్షలు చొప్పున మొత్తం రూ4.27 కోట్లకు కొనుగోలు చేయించారు. అదే విధంగా సర్వేనెంబరు 569,570,571,572లలో ఉన్న పేదల భూములు సుమారు 22 ఎకరాలను అతి తక్కువ ధరకు బినామీల పేరిట కొనుగోలు చేయించి వాటిని వారం వ్యవధిలో ప్రభుత్వానికి అమ్మించారు. ఇలా ఇదే మండలంలో సుమారు వందల కోట్ల వ్యాపారం చేశారు.ఇందులో పూర్తిగా ఉన్న తాధికారులు సహకరించారు. కల్వచర్లలో సుమా రు 10 ఎకరాలు, మల్లంపూడిలో సుమారు 10 ఎకరాలు, కానవరంలో సుమా రు 20 ఎకరాల భూములను తారుమార్ తక్కెడమార్ చేసి కోట్లాదిరూపాయలు నొక్కేశారు. ఇందులో నిజమైన రైతులకు కేవలం లక్షల్లో దక్కగా మధ్యవర్తులు, అధికారులు మాత్రం కోట్లు దండుకున్నారు.కొవ్వూరు డివిజన్‌లో చుక్కల భూముల వ్యవహారంలో న్యాయస్థానం నిబంధనలు భేఖాతర్ చేసి బొక్కేసినట్టు తెలిసింది. దీనికి కూడా అప్పటి కలెక్టర్ పూర్తిగా సహకరించారు. గోపాలపురంలో కొండల మాటున గప్‌చుప్‌గా భూములను కొట్టేశారు. అసలు రైతులకు చుక్కలు చూపిస్తున్నారు.

ఈజీగా అసైన్డ్ భూమార్పిడి..

అసైన్డ్ భూ ములు క్రయవిక్రయాలు చేయకూడదు.. ఆసైన్డ్ భూమిని మార్పుచేయాలంటే చాలా పెద్ద ప్రాసెస్ ఉంటుంది. అలాంటిది కేవలం వారం పది రోజుల వ్యవధిలో అధికారులు భూమార్పిడిని పూర్తి చేసేశారు. ఎందుకంటే వాళ్లే రియల్ వ్యాపారులుగా మారితే..ఇంక అడ్డేముంది! అందుకే ఇష్టానుసారం మార్చేశారు. కోట్లు కొట్టేశారు.

రూరల్‌లో భూములూ అంతే

రాజమహేంద్రవరం రూరల్ మండలంలో గతంలోను భూముల స్కామ్‌లు జరిగాయి. ఇటీవల ధవళేశ్వరం ఎర్రకొండ ప్రాంతంలో ఉన్న ఆసైన్డ్ భూమిలో ఇళ్ల పట్టాలకు గతంలో కేటయించారు. సుమారు 83 సెంట్ల భూమిని వెబ్ ల్యాండ్‌లో వ్యవసాయ భూమి కింద మార్చి కన్వర్షన్ కట్టి కడియం మండలానికి చెందిన వ్యక్తికి ఒక ఆసామికి అమ్మినట్టు చేసి దానిలో కొబ్బరి చెట్లను తొలగించి ఆగమేఘాలపై లేఅవుట్ వేసేశారు. దీనికి పూర్తి రూరల్ రెవెన్యూ అధికారులు సహకరించారు.ఇక ధవళేశ్వరంలో ఇరిగేషన్ భూములు అన్యాక్రాంతమైపోతున్నా కన్నెత్తి చూసేవారే కరువయ్యారు. మెయిన్‌రోడ్డును ఆనుకుని స్థలాలు కబ్జా చేసి షాపులు కట్టేసుకుంటున్నా కళ్లప్పగించి చూస్తున్నారు.అదేవిధంగా పిడింగొయ్యి పంచాయతీ పరిధి జాతీయ రహదారి సమీపంలో ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రిహోల్డ్ జీవోతో బినామీలకు కట్టబెట్టి అటుపై పెద్దవాళ్ళకు బదాయించే ప్రయత్నాలు జరిగాయి. ఇటీవల విచారణ కూడా నిర్వహించి పెండింగ్‌లో పెట్టారు.దీనిపై 9 వరకు కోర్టు కేసులు ఉన్నట్టు తెలిసింది. ఈ వ్యవహారాల్లో నేరుగా కలెక్టర్ కార్యాలయం అధికారులు కీ రోల్ పోషించినట్టు తెలిసింది. మోరంపూడిలో ఉన్న లేఅవుట్‌కు సంబంధించి పేర్ల మార్పులో కూడా కుంభకోణం జరిగింది. దీంతో మండలస్థాయిలో ఒక రెవెన్యూ అధికారి కీలకంగా వ్యవహరించి కలెక్టర్ కార్యాలయంలో చక్కబెట్టినట్టు తెలిసింది. హుకుంపేట సెంటర్‌లో ఉన్న జమిందార్ల భూమిని కొందరికి కట్టబెట్టేందుకు కమిషన్‌కు కక్కుర్తిపడినట్టు తెలిసింది.హుకుంపేట గ్రామంలో శాటిలైట్ సిటీకి వెళ్లే ప్రాంతంలో కూడా జమిందార్ భూముల రికార్డులను మార్పులు చేసి కొంతమందికి కట్టబెట్టడంతో అక్కడ లేఅవుట్లు వేశారు. కోలమూరు పరిధిలో గామన్‌వంతెన చాగల్నాడు పైప్ సమీపంలో కాలువ భూములు మాయం చేసి లేఅవుట్లు వేశారు. ఇలా భూములను కొల్లగొట్టేశారు.

రాజమహేంద్రవరంలో

రాజమహేంద్రవరంలో కూడా అక్రమ వ్యవహారాలు చాలా జరిగాయి. గత ప్రభుత్వ హయాంలో టీటీడీ రహదారిలో ఉన్న ప్రభుత్వ భూమిని ఒక అసామి సుమారు 30 ఏళ్ళకు లీజుతీసుకున్నాడు. దానికి సంబంధించి లీజు గడువు గతేడాది ముగిసింది. ఆ ఆసామి కూడా మరణించాడు. అయితే ఈ లీజును మరొక 30 ఏళ్ల పాటు ఆ ఆసామి వారసుల పేర పొడిగించేందుకు గత ప్రభుత్వంలో జిల్లా ఉన్నతాధికారులు రూ.30 లక్షలు తీసుకుని లీజును పొడిగించినట్టు తెలిసింది. అదేవిధంగా రాజమహేంద్రవరం గౌతమి సూపర్‌బజార్ కోఆపరేటివ్ సొసైటీకి చెందిన భూమి నగరం నడిబొడ్డున ఉంది. దానిని అప్పటికే ఒక వ్యక్తికి 11 ఏళ్ళపాటు లీజుకు ఇచ్చి అతని నుంచి మరొక వ్యక్తికి 33 ఏళ్ళపాటు సబ్ లీజుకు ఇచ్చేందుకు కూడా ఇదే అధికారులు పూర్తిగా సహకరించి డబ్బులు తీసుకున్నట్టు సమాచారం. ఇదే విషయాన్ని గుర్తించి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేశారు.దీనిపై విచారణ జరపాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంలో పూర్తిగా వైసీపీ ప్రజాప్రతినిధులు కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. ఇలా నగరంలో అనేక భూకుంభకోణాలు, అక్రమలీజులు చోటు చేసుకున్నట్టు తెలిసింది. ఇవి ఒక్కొక్కటిగా బయటకువస్తున్నాయి.

ఉన్నతాధికారులపై విచారణకు ఆర్‌డీవో స్థాయి అధికారులా?

రాజానగరం మండలంలో జరిగిన భూ అక్రమాల్లో అప్పటి కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌పై విచారణ వేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్వతంత్ర జనతా పార్టీ నేత బర్రే ఆనంద్ కుమార్ కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు.ఈ మేరకు ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.అయితే కలెక్టర్లపై చేసిన ఆరోపణలకు ఆర్‌డీవో, మైన్స్‌ఏడీ, ఇరిగిషనల్ ఎస్ఈలతో కూడిన అధికారులను విచారణాధికారులుగా నియమించడం పలు విమర్శలకు తావిస్తోంది. కలెక్టర్ స్థాయి అధికారులపై వచ్చిన ఆరోపణలను విచారించి నిగ్గుతేల్చేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించాల్సి ఉండగా దానికి విరుద్ధంగా కమిటీ వేయడంపైన ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ప్రభుత్వాలు మారినా అధికారుల తీరులో మార్పురాకపోవడం శోచనీయం.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

వైసీపీ పాలనలో ఖజానా ఖాళీ

● పర్యాటక శాఖామంత్రి దుర్గేష్ ● చివటంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



చివటంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని చివటం గ్రామంలో సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి మంత్రి దుర్గేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి కట్టుబడి ఉందన్నారు. ఉపాధిహామీ పథకంలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు గ్రామాల్లో చురుగ్గా జరుగుతున్నాయని, ఆర్‌అండ్‌బీ రోడ్ల గుంతలు పూడ్చే కార్యక్రమం వేగంగా జరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రూ.1600 కోట్ల బకాయిల లోటును, ఖజానా ఖాళీ చేసి వెళ్లిపోయిందన్నారు. ఆ లోటును పూడ్చి, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆర్నెల్ల పాలనలోనే ఆరేళ్ల అభివృద్ధి పనులు ప్రారంభించామని దుర్గేష్ చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రాధాన్య క్రమంలో జరుగుతున్నాయని, పనుల్లో ప్రజా సహకారం అవసరమని అన్నారు. దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి, సర్దార్ కాటన్ విగ్రహానికి, వంగవీటి మోహనరంగ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈడ్పుగంటి సత్యనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన మండలాధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, నాయకులు ముళ్లపూడి పాండురంగ, ఈడ్పుగంటి పాండురంగారావు పాల్గొన్నారు.

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో సుస్మిత

కొవ్వూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : డివిజనల్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో స్వీకరించిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించి దరఖాస్తుదారులకు సత్వర న్యాయం అందజేయాలని ఆర్డీవో రాణి సుస్మిత అధికారులకు సూచించారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 9 ఫిర్యాదులు స్వీకరించామన్నారు. పంచాయతీకి సంబంధించి 1, మైనింగ్ 1, రెవెన్యూ 6, పోలీసు 1 ఫిర్యాదును స్వీకరించామన్నారు. ఫిర్యాదులను ఆయా శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీవో సుస్మిత మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలో సోమవారం పీజీఆర్ఎస్ జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదును నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

» ఎమ్మెల్యే ముప్పిడి
» కొవ్వూరులో ఉచిత కుట్టు శిక్షణ



మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక 10వ వార్డు సచివాలయంలో సోమవారం కోలిండియా లిమిటెడ్ సౌజన్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ ఐకాన్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముప్పిడి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారత సాధించేందుకు ప్రభుత్వం చేయూతనందిస్తోందన్నారు. కోలిండియా సీఎస్ఆర్ ప్రాజెక్టులో భాగంగా 25 కుట్టుమిషన్లు మహిళలకు అందిస్తోందని, 14రోజులు శిక్షణ అందించి, అనంతరం ఆ మిషన్లను మహిళలకు అందించనున్నట్టు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఐకాన్ ఆధ్వర్యంలో ఆరు జిల్లాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కంఠమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, రోటరీక్లబ్ ఛైర్మన్ తీగల రాజా, ఇమ్మణి వెంకట్, సురేష్, పెనుమాక జయరాజు, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, మున్సిపల్ మేనేజర్ పి.సాయిబాబు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లులు లేకుండా ఇసుక తరలింపు

లారీని పట్టుకున్న టాస్క్‌ఫోర్సు

కొవ్వూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బిల్లులేకుండా ఇసుక రవాణా చేస్తున్న లారీని టాస్క్‌ఫోర్సు బృందం సభ్యులు పట్టుకున్నారు. సోమవారం పెండ్యాల ఇసుకర్యాంపు నుంచి బిల్లులు లేకుండా 24టన్నుల ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీని తీపర్రులో డిస్ట్రిక్ లెవెల్ సాండ్ టాస్క్‌ఫోర్సు డివిజన్ సభ్యులు మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ శైలజ, ఏఎస్ఐ జి.శ్రీనివాసరావు పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణాపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పెరవలి పోలీస్టేషన్‌లో అప్పగించినట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. లారీల్లో బాడీ లెవెల్ దాటి ఇసుక లోడ్ చేసినా, బిల్లులు లేకుండ ఇసుక తరలించినా క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

నిడదవోలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా నిడదవోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు క్విజ్ వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి ప్రిన్సిపాల్ కె.జ్యోతి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.నాగేశ్వరరావు, ఎస్ఎస్‌డీ లక్ష్మీదేవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సంఘాల అధ్యక్షుల క్షేత్ర పర్యటన



కాలువలను పరిశీలిస్తున్న నీటి సంఘం అధ్యక్షులు

పెరవలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పదవీ బాధ్యతలను చేపట్టిన వెంటనే నీటి సంఘం అధ్యక్షులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. గత ఐదు సంవత్సరాల కాలంలో సాగునీటి కాలువలు నిర్లక్ష్యానికి గురి కావడంతో ఎక్కడికక్కడే గండ్లు పడి, పూడుకుని పోయి సక్రమంగా నీరు ప్రవహించక రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. అధికారులు ఎక్కడైనా పనులు చేయిద్దామని ప్రతిపాదనలు పంపినా నిధుల్లేక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. రైతులు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న నాథుడు లేకుండాపోయాడు. ప్రస్తుతం సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిపి నూతన కమిటీలను ఏర్పాటు చేయడంతో రైతుల సమస్యలు పరిష్కారానికి అవకాశం ఏర్పడింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నీటి సంఘాల అధ్యక్షులు ఆయా కాలువలు వద్దకు వెళ్లి ఎక్కడెక్కడ సమస్యలున్నాయో గుర్తించారు. పేకేరు నీటి సంఘం అధ్యక్షుడు నల్ల సురేంద్ర ఖండవల్లి తూటావు కాలువను పరిశీలించి ఎక్కడ గండ్లు పడ్డాయో రైతులను అడిగి తెలుసుకున్నారు. పెండ్యాల కాలువ సంఘం అధ్యక్షుడు పుల్ల రాజశేఖర్ ఉసులుమర్రు నుంచి పందలపర్రు వరకు కాలువ వెంబడి పర్యటించి రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు కానూరు అగ్రహారం మెంబరు హనుమంతు సత్యనారాయణ ఉన్నారు.

ఉపాధి..ఊపిరి తీసింది!

ట్రాక్టరు తిరగబడి యువకుడి మృతి

తాళ్లపూడి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి ఊపిరి తీసింది. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన దుంపల రాజు(33) పెద్దేవం శివారులో ఇటుకబట్టీలో పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, నెలల వయసు గల బాబు ఉన్నాడు.ఇటుకలు తయారు చేయడానికి సోమవారం ఉదయం అడుసు మట్టిని ట్రాక్టరుతో తొక్కిస్తుండగా అకస్మాత్తుగా ట్రాక్టరు తిరగబడి అతను మట్టిలో కూరుకుపోయి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు తరలించామని స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.



మృతుడు దుంపల రాజు

గిరిజనులు అన్ని రంగాల్లో ముందుండాలి

» రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు సోమశేఖర నాయక్
» మద్దూరు, వాడపల్లి, మీనానగరంలో పర్యటన



చాగల్లు: మీనానగరంలో ఎస్టీలతో మాట్లాడుతున్న సోమశేఖర నాయక్

కొవ్వూరు/చాగల్లు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు సమాజంలో రాబోయో రోజుల్లో అన్నిరంగాలలో ముందుండాలన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య సోమశేఖరనాయక్ అన్నారు. సోమవారం కొవ్వూరు మండలం మద్దూరు, వాడపల్లి గ్రామాల్లో ఎస్టీ కులాల ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఆర్డీవో రాణి సుస్మిత, ఎంపీడీవో కె.సుశీల, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఎస్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి జ్యోతి, ఎలక్ట్రికల్, రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారులు స్వాగతం పలికారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రజలు తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువస్తే చర్యలు చేపట్టి న్యాయం జరిగేల కృషి చేస్తామన్నారు. ఎస్టీ ప్రజలు మాట్లాడుతూ తమ పిల్లలు మద్దూరు హైస్కూల్‌కు వెళ్లాలంటే 3 కిలోమీటర్లు వెళ్లవలసి వస్తోందని, రోడ్లు సరిగా లేవని, 10 తరగతి వరకు మద్దూరులోనే చదువుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైరస్ వ్యాపించి పందులు చనిపోతున్నాయని, ప్రభుత్వం కొంత ప్రదేశం చూపిస్తే పందులు పెంచుకుని జీవనం సాగిస్తామన్నారు. గ్రామంలో ఏకలవ్యుడి విగ్రహం ఏర్పాటుకు స్థలం ఇప్పించాలని కోరారు. సోమశేఖర నాయక్ మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఎంఈడీవో కె.సుశీల, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎన్ జ్యోతి పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు చర్యలు

చాగల్లు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలు పెంచుకోవడానికి రుణం మంజూరు చేయాలని ఎస్టీల కులపెద్ద కోటయ్య ఆధ్వర్యంలో గతంలో వినతి ఇచ్చిన నేపథ్యంలో మీనానగరంలో ఎస్టీలు అధికంగా ఉండే ప్రాంతంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనతో ఎస్టీలు మాట్లాడుతూ గ్రామంలో 22 మంది ఎస్టీలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, ఆర్థిక ఇబ్బందులు వల్ల ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నామని, ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. నాయక్ మాట్లాడుతూ మేకల పెంపకానికి రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సంచార జీవనం సాగించే తెగలకి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు మంజూరు చేసేలా మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహశీల్దార్ మెరికమ్మను ఆదేశించి ఆధార్, రేషన్‌కార్డు లేని వ్యక్తికి 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరుడికి విశేష పూజలు

నిడదవోలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులో బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శివుడికి ఇష్టమైన రోజు కావడంతో స్వామికి విశేష పూజలు అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో వేద పండితులు విశేష అభిషేకాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

కొవ్వూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పురపాలక సంఘంలో ఈ నెల 17 నుంచి 28 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. 17, 18 తేదీల్లో ఏబీఎన్ డిగ్రీ కళాశాల, 19,20 తేదీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, 26,27 తేదీల్లో పీఎంఎం మున్సిపల్ హైస్కూల్, 28న ఏఎస్ జడ్పీ బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గోపాలపురం: మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల వద్ద ఈ నెల 17 నుంచి 20 వరకు ప్రత్యేక ఆధార్ నమోదు సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో టీఎస్ఎస్ శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్‌లో మార్పులతోపాటు కొన్నింటికి ఆధార్ అనుసంధానం చేసేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇదిలా ఉండగా సచివాలయ సిబ్బందికి రెండో దఫా శిక్షణ తరగతులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

28న మెగా వైద్య శిబిరం

తాళ్లపూడి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28న తాళ్లపూడిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్‌కుమార్ తెలిపారు. వైద్య శిబిరం పోస్టర్‌ను సంస్థ చైర్మన్ సింహాద్రి జనార్దనరావు, డైరెక్టర్ గోకవరపు బాబు ఆవిష్కరించారు. రాజానగరం జీఎస్ఎల్ హాస్పిటల్ సౌజన్యంతో 30 మంది వైద్యులతో శిబిరాన్ని నిర్వహించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందిస్తామని జనార్దనరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో సనపల రాజశేఖర్, అప్పన హనుమంతరావు, పెమ్మాడి దుర్గాప్రసాదు, బమాధవరపు రామచంద్రం, జి.మునేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నదేవరపేటలో

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

తాళ్లపూడి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలను అందరూ ఆచరించినపుడే సమాజంలో అసమానతలు తొలుగుతాయని టీడీపీ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య అన్నారు. మండలంలోని అన్నదేవరపేటలోని పాతపేటలో అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎలిపే సుధారాణి, ఎలిపే రాజు, అక్కాబత్తు విజయ్‌కుమార్, తాడేపల్లి వెంకటేష్, గుమ్మడి చంద్రశేఖర్, నల్లి ప్రకాష్, సీఐ విజయబాబు, ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

వరద గోపాలస్వామికి

లక్ష తులసి పూజ

కొవ్వూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరులోని పాతవూరులో శ్రీరుక్మిణి, సత్యభామ సమేత వరద గోపాలస్వామి ఆలయంలో లక్ష తులసీపూజ నిర్వహించారు. సోమవారం ధనుర్మాసోత్సవాలను ప్రారంభించారు. ఆలయ అర్చకులు విశ్వక్సేన, కలశ, లక్ష తులసీ పూజలు, మహాలక్ష్మీ అమ్మవారికి కుంకుమార్చన, విష్ణుహోమం జరిపారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో కస్తూరి కాంతారావు, పమ్మి రవిబాబు, బాలప్ప రాంప్రసాద్, బాలప్ప, వీఎస్ఎస్ ప్రసాద్, వైవీవీ సూర్యనారాయణమూర్తి, వాడ్రేవు సాయి కామరాజు, వై.కామేశ్వరరావు పాల్గొన్నారు.

మంచు..ముంచుతోంది!

● అనంతపల్లి వద్ద రెండు రోజుల్లో రెండో ప్రమాదం
● నుజ్జునుజ్జయిన ట్రావెల్ బస్సు
● మంచు ప్రభావంతో వ్యాన్‌ని వెనుక నుంచి ఢీకొట్టిన బస్



నుజ్జునుజ్జయిన బస్సు

నల్లజర్ల,డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మంచు కారణంగా రోడ్డు కనిపించక పోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మండలంలో అనంతపల్లి హైవేపై ప్రమాదకరంగా మారింది. శనివారం తెల్లవారుజామున ఒక ప్రైవేట్ ట్రావెల్ బస్ ప్రమాదానికి గురికాగా.. సోమవారం తెల్లవారుజామున మరో ప్రైవేటు ట్రావెల్ బస్ ప్రమాదానికి గురైంది. అయితే రెండు ప్రమాదాల్లోనూ ప్రయాణికులు క్షేమంగా బయటపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. గుంటూరు నుంచి విశాఖపట్నం 40 మంది ప్రయాణికులతో వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు అనంతపల్లి చేరుకున్న సమయంలో మంచు ప్రభావంతో కనిపించక ముందు వెళుతున్న ఐసర్ వ్యాన్‌ని ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ప్రయాణికులకు ఏటువంటి గాయాలు కాకపోవడంతో పోలీసులు మరొక బస్సులో వారిని గమ్యస్థానాలకు పంపించి వేశారు.సీఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

» గత ప్రభుత్వంలో రైతుల ఇబ్బందులు సరిదిద్దేందుకు చర్యలు
» ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
» పలుచోట్ల రెవెన్యూ సదస్సులు



కొవ్వూరులో ఆర్డీవో సుస్మితకు, ఎమ్మెల్యే ముప్పిడికి సమస్యలు వివరిస్తున్న రైతులు

కొవ్వూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయిలో భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరు పట్టణానికి సంబంధించి స్థానిక తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఎం.దుర్గాప్రసాద్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఆర్డీవో రాణి సుస్మిత, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా విచ్చేసి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూములకు సంబంధించి అడంగల్ ఒక పేరు, 1బిలో ఒక పేరు ఉంటుంది. పొజిషన్‌లో ఒకరు ఉంటారు. రికార్డుల్లో మరొకరు ఉంటారు. వీళ్లకి తెలియకుండా వేరొకరు రిజిస్ట్రేషన్ చేసేసుకుంటారు. తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరుగుతూనే ఉంటున్నారన్నారు. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టలో సాయి అనే రైతుకు పూర్వీకుల నుంచి వస్తున్న భూమిని మధ్యవర్తులు కొంతమంది గుంటూరు జిల్లా పోచవరం గ్రామానికి చెందిన వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేసేశారు. ఆన్‌లైనులో రికార్డులు చూస్తే విషయం బయటకు వచ్చిందని, దీంతో బాధితుడు తహశీల్దార్‌కు, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రైతులు రకరకాలుగా ఇబ్బందులు పడ్డారని, వాటిని సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలు పరిష్కరిస్తోందన్నారు. ప్రజలు ఏ ఇబ్బందులున్నా రాత పూర్వకంగా అందించి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయాల్లో వారానికి ఒక మండలంలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను స్వీకరిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు కంఠమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, పెనుమాక జయరాజు, ఆర్ఐ బి.విశ్వేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



చాగల్లు: ముప్పవరంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు

చాగల్లు: మండలంలోని ఎస్.ముప్పవరంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల సమస్యలపై 3 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మెరికమ్మ మాట్లాడుతూ భూ వివాదాలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు, ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ కమాల్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సచివాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 8 వినతులు వచ్చినట్టు తహశీల్దార్ కె.అజయ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు కుందుల నారాయణరావు, వీఆర్వో వాసు పాల్గొన్నారు.



గోపాలపురం సదస్సులో మాట్లాడుతున్న రైతు

22/ఏ లిస్టు నుంచి తొలగించాలి

గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డులో భూములు కోల్పోయిన రైతుల వినతి



దేవరపల్లిలో తహశీల్దార్‌కు వినతిపత్రాలు అందజేస్తున్న రైతులు

దేవరపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డులో భూములు కోల్పోయిన రైతుల భూములు 22/ఏ లిస్టులో నుంచి తొలగించాలని రైతులు కోరారు. దేవరపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు సోమవారం జరిగింది. అధిక సంఖ్యలో రైతులు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. దేవరపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ హైవేలో రైతుల భూములు తీసుకున్నారని జాతీయ రహదారికి తీసుకోగా మిగిలిన భూమి రైతులకు 22/ఏ నుంచి తీసివేయాలని కోరారు. యాగంటి హనుమంతరావుకు చెందిన 2ఎకరాల 13సెంట్ల భూమిలో 34సెంట్లు గ్రీన్‌ఫీల్డ్ హైవేలో పోయిందని మిగిలిన భూమి ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలని తెలిపారు. పల్లంట్లకు చెందిన ఎంపాటి మునికోటేశ్వరరావు తన భూమి 2ఎకరాల 5సెంట్లు ఉంటే 98సెంట్లు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదయ్యిందని ఈ సర్వే చేసి తన భూమిని ఆన్‌లైన్‌లో చేయాలని కోరారు. దేవరపల్లి వార్డు సభ్యులు గ్రామ పరిధిలోని పోలవరం, తాడిపూడి కాల్వ గట్లపై ఉన్న చెట్లను అక్రమంగా యథేచ్ఛగా నరికేస్తున్నారని దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ రాజ్యలక్ష్మిని కోరారు. గ్రామంలోని హిందూ శ్మశాన వాటికకు వెళ్లే దారి ఆక్రమణలకు గురైందని, ఆ వీధిని సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని కోరారు. రీసర్వే సరిగా చేయకపోవడంతో రైతుల భూములు హెచ్చుతగ్గులు అయ్యాయని వాటిని రీసర్వే చేసి ఆన్‌లైన్ చేయాలని రైతులు కోరారు. ముందుగా గ్రామంలోని దళితవాడకు తహశీల్దార్ వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాగా సదస్సుకు 10 ఫిర్యాదులు వచ్చాయని వాటిలో రీసర్వేకు 3, 22/ఏలిస్టు నుంచి తొలగించాలని 4, మిగిలినవి ఇతర సమస్యలపై అందాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, కార్యదర్శి కే.రవికిషోర్, టీడీపీ నాయకులు సుంకర దుర్గారావు, గద్దే సుబ్రహ్మణ్యం, కరుటూరి శ్రీనివాస్, ఉప్పులూరి రాంబాబు పాల్గొన్నారు.

రెండెకరాల్లో చెరకు తోట దగ్ధం



గోపాలపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మండలు ఏర్పడి జగన్నాథపురం గ్రామానికి చెందిన రైతు కొఠారి సత్యనారాయణకు చెందిన రెండు ఎకరాల చెరుకు తోట కాలిపోయింది. స్థానికుల వివరాల ప్రకారం.జగన్నాథపురం గ్రామానికి చెందిన కొఠారి సత్యనారాయణకు చెందిన చెరుకుతోటకు సమీపంలో మరో రైతు వరి దుబ్బులకు మంట పెట్టగా నిప్పులు ఎగసిపడి చెరుకు తోటకు నిప్పు అంటుకుందని, సుమారు రూ.2 లక్షల నష్టం ఏర్పడినట్టు రైతులు చెబుతున్నారు.

దుర్గామల్లేశ్వరుడికి పూజలు

ఉండ్రాజవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంగి గ్రామంలో రామలింగేశ్వరస్వామి ఆలయం, కె.సావరం దుర్గమల్లేశ్వరి స్వామి ఆలయంలో స్వామివార్లకు సోమవారం ప్రత్యేక పూజలు, అన్నాభిషేకం నిర్వహించారు. మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సోమవారం రావడంతో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అభిషేకములు నిర్వహించారు. ఆలయ కమిటీవారు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

ఇంధన పొదుపుపై పోటీలు



తాళ్లపూడి:వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తాళ్లపూడి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పొదుపు వారోత్సవాల సందర్భంగా సోమవారం తాళ్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యుత్ వినియోగంపై వ్యాస రచన పోటీలు నిర్వహించినట్టు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 14 నుంచి 20వరకూ విద్యుత్ వినియోగంపై పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని,ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

చాగల్లు: ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంధన పొదుపుపై వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్టు విద్యుత్ డీఈఈ ఎం.కృష్ణనాయక్ తెలిపారు. భవిష్యత్ అవసరాల కోసం ప్రతివారు ఇంధనాన్ని పొదుపు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంధన పొదుపు, గ్రీన్ ఎనర్జి, సేవ్ ఎనర్జీ అనే అంశాలపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఈ ఎం.డేవిడ్ నిశ్చల్, సిబ్బంది, ఎంఈవో బొబ్బిలి బాల స్వరూప్ పాల్గొన్నారు.



పెరవలి: చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



కొవ్వూరులో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొవ్వూరు: కొవ్వూరు అభ్యాస పాఠశాలలో విద్యార్థులకు ఇంధన పొదుపుపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్టు పట్టణ విద్యుత్‌శాఖ ఏఈ డి.జగదీశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ ఎం.కృష్ణనాయక్, జేఈ ఎస్‌వీవీ ప్రసాద్, సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.